## తిరుమాడ వీధులలో విహరించిన సుందరరాజస్వామి

తిరుచానూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:



తిరుచానూరు తిరుమాడ వీధుల్లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సుందరరాజస్వామి ఊరేగితూ భక్తులకు అభయం ఇచ్చారు. స్వామివారు జన్మ నక్షత్రం ఉత్తరాభాద్ర సందర్భంగా సుప్రభాతంతో మేలుకొలుపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వాహన మండపంలో శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారిని సుందరంగా అలంకరించి తిరుచిపై కొలువు తీర్చారు. అనంతరం తిరుమడ వీధులలో ఊరేగితూ భక్తులకు అభిమిచ్చారు. స్థానికులు భక్తులు కర్పూర నీరాజనాలతో స్వామివారి అమ్మవార్ల కృపాకటాక్షాలకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవరాజులు సూపరింటెండెంట్ రమేష్ ఇన్స్పెక్టర్ సుభాస్కర్, విజిలెన్స్ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.




నూతన ఈఓ సింఘాల్ ముందు

# సవాళ్ళెన్నో!?

**ముందు దేవుని బ్రహ్మోత్సవాలే ప్రాధాన్యతగా పరిగణనలోకి**

**నెలరోజుల తరువాత దశలవారీగా ప్రక్షాళనకు శ్రీకారం**

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:



ధార్మికసంస్థ టిటిడి నూతన ఈఓగా నేడు రెండోదఫా బాధ్యతలు చేపట్టనున్న అనిల్ కుమార్ సింఘాల్ ముందు పలు సవాళ్ళు నిలుస్తున్నాయి. టిటిడిలో సేవాభావంతో,సమన్వయంతో పనిచేయడం ఆయనకు ఇదివరకే అలవడిన సులక్షణం. ఆయన దేవుని చెంత పనిచేయడంలో సుపరిచయులు...పాలనలో అనుభవం ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి. గతంలో 2017 నుండి 2020 అక్టోబర్ వరకు ఈఓగా ఆయన పనితీరు, పలు సంస్కరణలు,నూతన దర్శన విధానాల అమలు కొంతవరకు సఫలీకృతులయ్యారు. దీంతో ఆయనపై నమ్మకంతో తాజాగా కూటమి ప్రభుత్వం,సిఎం చంద్రబాబునాయుడు టిటిడిలో ప్రక్షాళనకు,గతంలో అదుపుతప్పిన అస్తవ్యస్థ పాలనను గాడిలో పెట్టడానికి మళ్ళీ సింఘాల్‌ను ఈఓగా నియమించడం ప్రత్యేకత ఉంది. సామాన్యభక్తులకు త్వరితగతిన రెండుమూడుగంటల్లోనే కంపార్టుమెంట్లలో నిరీక్షణ లేని దర్శనం చేయించాలనే టిటిడి బోర్డు తపన,ప్రతిపాదనలు, నిర్ణయాన్ని ఇప్పుడు ఈఓగా ఈయన ఆచరణలోకి తీసుకురావడానికి మరింత అధ్యయనం చేయాల్సి ఉంది. టిటిడి అదనపు ఈఓగా ఇప్పటికే పాలనాదక్షత కలిగి,టిటిడిపై పూర్తిస్థాయిలో అవగాహనతో పట్టుసాధించుకున్న చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరితో సింఘాల్ సమన్వయం, సఖ్యతగా మెలిగే అంశం ఆయనకు అలవడిన మంచిభావన. తనదైన శైలిలో నూతన ఈఓగా టిటిడిలో తిష్టవేసిన అన్యమత ఉద్యోగులు, అధికారులకు విఆర్ఎస్ ఇచ్చే అంశం, ఏఐ అమలు , ఉద్యోగులకు నేమ్‌బ్యాడ్జీ, వడమాలపేట పాదిరేడు వద్ద ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ళస్థలాల ప్రాంతంలో అభివృద్ధి, మౌలిక సౌకర్యాలు కల్పనపై అధ్యయనంతో కూడిన పనితీరు అవసరం. ఇప్పటికే వైసిపికి అనుచరులుగా ఉన్న కొందరు ఉద్యోగులను బదిలీ చేయడం, ఎస్వీబిసిలో వివాదాస్పద ఉద్యోగుల బదిలీలు వంటివి సింఘాల్‌కు సవాల్‌గా మారనున్నాయి. టిటిడిలో ఏడాదికాలంగా సమస్యలు ఎక్కడికక్కడ తిష్టవేశాయని, అపరిష్కృతంగా ఉన్నాయని రెండురోజుల క్రిందట టిటిడి స్టాఫ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ నేతలు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. అంతేగాక టిటిడి ఉద్యోగులకు వారివారి బంధువులకు, స్నేహితులకు దర్శనాల ప్రాధాన్యత లేకపోవడం వంటివి ఇప్పుడు ఈఓగా అనిల్‌కుమార్‌కు కొంత సవాల్‌గానే ఉన్నాయి.టిటిడి ఉద్యోగులు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం ఆర్థిక సాయం అందడంలేదని ప్రధాన విమర్శలు. ఇప్పటికే గత బోర్డులో నిర్ణయించి అమలుచేయాల్సిన కొన్ని అభివృద్ధి పనులపై ఈయన సమీక్షించి సానుకూలంగా వ్యవహరించడం తప్పనిసరి. ఇక ఆయన ముందు సవాల్‌గా దేవదేవుని సాలకట్ల బ్రహ్మోత్సవాలు 24నుండి ప్రారంభం కానుండటం, తొలిరోజే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు తీసుకురావడం వంటివి సింఘాల్ సానుకూలధోరణితో ముందుకు కదలాల్సి ఉంది. బోర్డులో ఛైర్మన్‌తో సఖ్యతగా మెలగడంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా అనుభవం ఉన్న ఈఓగా సింఘాల్ తనదైన రీతిలో సమన్వయంతో పనిచేస్తారనేది టిటిడి వర్గాల్లో కూడా సానుకూలత వ్యక్తమవుతోంది. నేటి ఉదయం 11గంటలకు దేవుని ఆలయంలో ఆయన బాధ్యతలు చేపడుతున్నారు.

# అన్నదాతకు తప్పని వెన్నుపోటు

**చిత్తూరులో 30 పోలీస్ యాక్ట్ విఫలం**

**అర్డీఓ కార్యాలయం ఎదుట నిరసనకు పెద్ద ఎత్తున తరలివచ్చిన వైకాపా నాయకులు, శ్రేణులు**

**అర్డీఓ శ్రీనివాసులుకు మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎంసి విజయానందరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, కృపాలక్ష్మీలు వినతిపత్రం**





చిత్తూరులో వైకాపా నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు, చిత్తూరు అర్డీఓ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్తున్న వైకాపా నాయకులు.

చిత్తూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అన్ని వర్గాలతో పాటు అన్నదాతలకు సైతం వెన్నుపోటు తప్పలేదని మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, జిడినెల్లూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కృపాలక్ష్మీలు ధ్వజమెత్తారు. చిత్తూరు గంగినేని చెరువు నుండి అర్డీఓ కార్యాలయం వరకు బుధవారం అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా వైకాపా నాయకులు, కార్యకర్తలు, రైతులు ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో బుధవారం నుండి ఈ నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో వుంటుందని పోలీసులు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వైకాపా నాయకులు, కార్యకర్తలు, రైతులు పోలీసుల మాటలు పెడచెవినపెట్టారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు, రైతులు చిత్తూరుకు బుధవారం పెద్ద ఎత్తున తరలిరావడంతో చిత్తూరులో ఎక్కడా 30 పోలీస్ యాక్ట్ కన్పించని పరిస్థితి ఏర్పడింది. ప్రదర్శనగా వస్తున్న వైకాపా నాయకులను కొంతమందిని పోలీసులు నిలుపుదల చేయడానికి ప్రయత్నించినప్పటికీ పోలీసులను పట్టించుకోకుండా వైకాపా నాయకులు, కార్యకర్తలు ముందుకు కదలి వెళ్ళిపోయారు. చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ ఒకటి రెండు చోట్ల ప్రదర్శనగా వస్తున్న వైకాపా నాయకులను అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో ఆయనతో నాయకులు వాగ్వివాదం చేయడంతో మిన్నకుండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అర్డీఓ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, చిత్తూరు, పూతలపట్టు, జిడినెల్లూరు నియోజకవర్గాల వైకాపా ఇన్‌ఛార్జీలు ఎంసి విజయానందరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, కృపాలక్ష్మీలు మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం రైతులకు ప్రతి ఏడాది అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయలు ఇస్తామని హామీ వచ్చిందని, ప్రస్తుతం రెండవ ఏడాది గడుస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రైతులకు ఇచ్చింది కేవలం 7 వేల రూపాయలు మాత్రమేనని మిగిలిన 33 వేల రూపాయలు సత్వరం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటలు సాగు చేసిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా పంటలు సాగు చేస్తున్న రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాల్లో ఎరువులు ఎప్పుడు లభిస్తాయనే విషయం తెలియని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. జిల్లా రైతులు ఎరువుల కోసం ప్రక్క రాష్ట్రాల్లో బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని మండి పడ్డారు. అనంతరం వీరు అర్డీఓ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, మాజీ జడ్పీ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా, బంగారుపాళ్యం వైకాపా మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, రాష్ట్ర మొదలియార్ సంఘ అధ్యక్షులు జ్ఞానజగదీష్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ మహిళా విభాగం కార్యదర్శి హరిణిరెడ్డి, వైకాపా నాయకులు గౌహతి సుబ్బారెడ్డి, ధనంజయరావు, కిరణ్, ఖాదర్, శ్రావణ్, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## అందుబాటులో రెండు నెలల యూరియా నిల్వలు : జిల్లా కలెక్టర్

పుంగనూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఆర్ఎస కె ల ద్వారా యూరియా పంపిణీ చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో యూరియా పంపిణీలో భాగంగా మంగళవారం పుంగనూరులో ఆర్ ఎస్ కె లను, సొసైటిలలో యూరియా పంపిణీని కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పుంగనూరు ఫారెస్ట్ గెస్ట్ హౌస్ లో కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఆర్ ఎస్ కె ల ద్వారా రైతుకు ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నామని, ఇప్పటి వరకు 18 వేల మంది రైతులకు 1500 మెట్రిక్ టన్నుల పంపిణీ చేపట్టడం జరిగిందన్నారు. పలమనేరు, పుంగనూరు నియోజకవర్గంలో వరి అధికంగా పండిస్తున్న నేపథ్యం లో రైతులకు అదనంగా యూరియా బస్తాలు అవసరం అవుతున్నందున వచ్చే ఆదివారం నుండి మంగళవారం వరకు మరొక బస్తా పంపిణీకి చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో ఇంకా 2 వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియా నిల్వలు ఉన్నాయని, ఈ నిల్వలు మరొక రెండు నెలలకు రైతుల అవసరాలకు సరిపోతాయన్నారు. అవసరం అయితే మరిన్ని బస్తాలు జిల్లాకు తెప్పిస్తామన్నారు. గత సంవత్సరం పంపిణీ చేసిన సరాసరికంటే ఇది అధికమని రైతులు గుర్తించాలన్నారు. ఆర్ ఎస్ కె లలో ఈకెవైసీ, బయో మెట్రిక్ డిబిటిపద్ధతిలో పారదర్శకంగాయూరియా పంపిణీ చేస్తున్నామన్నారు. యూరియాతో పాటు నానో యూరియాను కూడా వాడవచ్చునని దీని పై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.




సూర్యప్రభ వాహనంపై

## అలరించిన విఘ్ననాధుడు



కాణిపాకం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉభయదేవేరులతో కలసి విఘ్ననాధుడు సూర్యప్రభ వాహనంపై గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. మంగళవారం రాత్రి సూర్యప్రభవాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కీ॥శే॥శ్రీమతి రాజమ్మ 'అండ్ కీ॥శే॥ సి.రాజశేఖర్‌నాయుడు గార్ల కుమారులు, సి.ఇంద్రసేననాయుడు,అండ్ శ్రీ సి.లక్ష్మీపతినాయుడు, 44 బొమ్మసముద్రం వారు ఉభయ దారులుగా వ్యవహరించారు. వారు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ పంచామృతాభిషేకంను నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి స్వామివారు ఉభయదేవేరులతో కలసి వేదపండితులు మం త్రోచ్చారణ నడుమ సూర్యప్రభ వాహనంపై అధిరోహించి విహరించారు. ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు,ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

## కట్ట పుట్టాలమ్మతల్లో... కాపాడమ్మా...

**జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు...**



రేణిగుంట సెప్టెంబర్ 9 ప్రభాతవార్త

శ్రీ కట్ట పుట్టాలమ్మ తల్లి చల్లంగా చూడమ్మా అని భక్తులు తన్మయత్వంతో అమ్మ తల్లికి మంగళవారం పొంగళ్ళు పొంగించారు. తిరుపతి, కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, శ్రీ అన్నమయ్య జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. గుడి ప్రాంగణంలో అమ్మవారికి పొంగళ్ళు పొంగించారు. దేవాలయ కమిటీ సభ్యులు అమ్మవారి గుడి ప్రాంగణాన్ని పుష్పాలతో అలంకరించారు. అమ్మవారికి విశేషంగా పూజలు అభిషేకాలు జరిపించి భక్తులకు శ్రీ కట్ట పుట్టాలమ్మ తల్లి దర్శన భాగ్యాన్ని కల్పించారు. రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, రూరల్ సీఐ మంజునాథ రెడ్డి, అర్బన్ ఎస్సై నాగరాజు, గాజులమండ్యం ఎస్సై సుధాకర్, అర్బన్ ట్రైనీ ఎస్సై స్వాతి, గాజుల మండ్యం ట్రైనీ ఎస్సై ప్రవల్లిక దాదాపు 100 మంది పోలీసులు జాతరలో శాంతిభద్రతలు పరీక్షించడానికి విధుల్లో ఉన్నారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం ఆలయ కమిటీ సభ్యులు మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పాడి రాజేంద్ర, కార్యదర్శి మోహన్, కమిటీ సభ్యులు కే వి చలం, సుధాకర్, హరికృష్ణ, శీను, నాగేశ్వరరావు, ముని రాజా, సుబ్రహ్మణ్యం, రామనారాయణ, ఏ. మోహన్ దేవాలయ ప్రాంగణంలో భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేసి అమ్మవారిని సులువుగా దర్శనం చేసుకునే వెసులుబాటు కల్పించారు. కరకంబాడి టిడిపి క్లస్టర్ ఇన్చార్జి బుజ్జి నాయుడు, కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సహాయ సహకారాలతో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

## అన్నదాతల ఆర్తనాదాలు: ఆదుకోని ప్రభుత్వం



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త

రాష్ట్రంలో అన్నదాతలు సమస్యలతో సతమతమౌతూ ఆర్తనాదాలు చేస్తుంటే కుర్చీకోసం కోటి హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఆదుకోకుండా తమాషా చూస్తుందని వైకాపా నాయకులు శివమెత్తారు. మంగళవారం శ్రీకాళహస్తిలోని వైకాపా పార్టీ కార్యాలయం నుంచి అన్నదాత పోరు ర్యాలిని నిర్వహించారు. మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన ఆందోళన కార్యక్రమాలకు జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంఎల్సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంలు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ర్యాలిని ప్రారంభిస్తూ మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ రైతులు యూరియా లేకుండా తల్లడిల్లుతుంటే కళ్ళెదుటే పంటలకు తెగుళ్ళు సోకి నష్టం వాటిల్లుతుంటే పడే బాధ వర్ణనాతీతంగా ఉందన్నారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను పంపిణి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలి ప్రారంభం కాగానే మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి తల్లికి అస్వస్థతతో కళ్ళు తిరిగి పడిపోయారనే సమాచారంతో ఆయన ఆసుపత్రికి పరుగులు తీసారు. కాగా ర్యాలిని జిల్లా నాయకుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఎంఎల్సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్‌ల సారథ్యంలో ర్యాలి శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం వరకు సాగింది. అక్కడ కొంత సేపు ధర్నా జరిపారు.

# తిరుచానూరులో పత్తాలేని పంచాయతీ రెవెన్యూ అధికారి!

**- నామమాత్రంగా మారిన విఆర్ఓ కార్యాలయం - ఎంఆర్ఓ కార్యాలయానికి పరిమితం అవుతున్న విఆర్ఓ**

తిరుచానూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:

తిరుచానూరులో పంచాయతీ రెవెన్యూ అధికారి అందుబాటులో లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుపతి గ్రామీణ మండలంలో తిరుచానూరు పంచాయతీ మేజర్ పంచాయతీ. ఈ గ్రామంలో సుమారు 30 వేల మంది జనాభా నివసిస్తున్నారు. మేజర్ పంచాయతీ అందువల్ల ఐదు సచివాలయాలుగా విభజించిన విషయం విదితమే. ఈ ఐదు సచివాలయంలో మొదటి సచివాలయం పంచాయతీకి కేంద్రంగా వుండి అధిక జనాభా కలిగివున్నది. ఇందులో గ్రేడ్ 1 వీఆర్వోలను నియమిస్తుంటారు. రెవిన్యూపరంగా కార్ పార్కింగ్ టెండర్ ద్వారా మరియు ఇతర పన్నులు ద్వారా సుమారు ఐదు నుండి ఆరు కోట్లు ఆదాయం కలిగి వుంటుంది. ఇంతటి రెవెన్యూ ఆదాయం కలిగిన ఈ పంచాయతీలో సాధారణ ప్రజలకు కావలసిన నేటివిటీ, ఫ్యామిలీ మెంబర్షిప్, క్యాస్ట్, రేషన్ కార్డుల సంబంధిత మొదలగు అనేక వ్యవహారాలకు సర్టిఫికెట్లు మంజూరు ప్రభుత్వం నిర్దేశించిన సమయములోపు వారి వారి సర్టిఫికెట్లు అందచేయవలసిన గ్రామ రెవెన్యూ అధికారి ఎల్లవేళలా అందుబాటులో లేకపోవడం, ఫోన్లో సైతం స్పందించకపోవడంతో స్థానికులు అసహనానికి గురి అవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో నాలుగైదు సార్లు ఎంఆర్ఓ కార్యాలయాలు తిరిగి తమ పనులను ముగించుకుంటున్నారు. తమ గ్రామాల్లోనే చేసుకోవలసిన రెవెన్యూ శాఖ సంబంధించిన పనులకు మండల కార్యాలయాలు తిరగవలసి రావడంతో ప్రజలు తీవ్ర అసహనానికి లోనై రాష్ట్ర ప్రభుత్వాన్ని స్థానిక నాయకులను తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో పనిచేసిన బిల్ కలెక్టర్ చేతివాటం వెలుగులోకి రావడంతో అతనిని బదిలీ చేసిన విషయం విదితమే. ఒకవైపు అవినీతి మరోవైపు అధికారుల నిర్లక్ష్య ధోరణితో తిరుచానూరు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.




## గ్రావెల్ మాఫియా కోరల్లో చిక్కుకున్న

# పాలసముద్రం మండలం

పాలసముద్రం: సెప్టెంబర్ 9 ప్రభాతవార్త



పాలసముద్రం మండలం జిల్లాలో ఉన్న అతి చిన్నమండలం. ఈ మండలం లో అధికంగా కొబ్బరి చెట్లు ఉండటం వల్ల మరో కోనసీమ అని పచ్చని చెట్లు ఉండ డంతో కేరళ ను తలపిస్తున్నట్టు ఉందని మండలానికి కొత్తగా వచ్చినవారు అటుం టారు. అలాంటి స్వచ్ఛమైన వాతావరణం కలిగి సహజ సిద్ధంగా ఏర్పడి న గుట్టలు, చెట్లు ఆహ్లాదకరమైన వాతావరణం ఈ మండలంలో ఉంటుంది. ఇలాంటి ప్రకృతి రమణీయమైన మండలంలో గత కొన్ని నెలలుగా గ్రావెల్ మాఫియాకు ఈ మండలం పై కన్ను పడింది. ఈ మండలం యొక్క దురదృష్టం ఏమిటంటే తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో అక్రమార్కులకు రాచమార్గంగా ఈ మండలం ఏర్పడింది. ఈ మండలంలోని బలజ కండిగ, వనదుర్గాపురం పంచాయతీలలో అధికంగా గ్రావెల్ గుట్టలు ఉన్నాయి. వాటిపై గ్రావెల్ మాఫియా కన్ను పడటంతో అధికారుల కన్నుగప్పి ఒక్కొక్క రోజు ఒక్కొక్క చోట గ్రావెల్ దందా చేస్తున్నారు. అధికారులకు తెలిసి అడిగితే రెండు రోజులు ఆపడం మరల కుక్క తోక వంకర అన్నట్టుగా యథేచ్ఛాగా ఆంధ్ర ఎర్ర బంగారాన్ని తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సోమవారం వన దుర్గాపురం పంచాయతీలో సుమారు పది టిప్పర్ల తో గ్రావెల్ తరలిస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక తహసిల్దార్ అరుణ కుమారి , ఎస్సై చిన్న రెడ్డప్ప సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 10 ట్రిప్పర్లకు గ్రావెల్ నింపి తరలించడానికి సిద్ధంగా ఉన్నాయి వాటికి సంబంధించి రికార్డులు అడగగా 10 టిప్పర్ల కు కలిపి కేవలం 15 టన్నుల కు మాత్రమే ప్రభుత్వానికి రుసుము కట్టిన రసీదును చూపించారు ఒక్క రసీదుతో ఇన్ని వాహనాలను నడుపుతున్నారు. ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి అక్రమార్కులు జోబీలు నింపుకుంటున్నారు. రికార్డులు చూపమని అడిగిన అధికారులపై న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన పత్రికా విలేకరుల పై గ్రావెల్ మాఫియా దాడికి యత్నించారు. 10 టిప్పర్లు గ్రావెల్ నింపుకొని ఉండగా తనిఖీలకు వెళ్లిన అధికారులు నామమాత్రంగా రెండు టిప్పర్లలను మాత్రమే స్వాధీన పరుచుకొన్నారు. సంబంధిత అధికారులు వాటిని కూడా కేవలం 15000 కట్టించుకుని మంగళవారం రిలీజ్ చేశారు .గతంలో స్వాధీన పరుచుకున్న టిప్పర్ల కు ఒక్కొక్క వాహనానికి 65 వేల రూపాయల చొప్పున కట్టించుకున్నారు. ఈ రెండింటి మధ్య ఉన్న మతలబ్ ఏమిటని గతంలో సీజ్ చేసిన టిప్పర్ల యజమానులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు.

# నేటి నుండి పోలేరమ్మ జాతర

**- ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు**

వెంకటగిరి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర నేటి నుండి ప్రారంభం అవుతుంది. పోలేరమ్మ అమ్మవారిని బుధవారం తయారుచేసి రాత్రి నుండి భక్తుల దర్శనార్థం గుడి వద్ద ఉంచుతారు. 11వ తేదీ గురువారం అమ్మవారి దర్శనం అనంతరం సాయంత్రం నిష్క్రమణ కొరకు ఊరేగింపుగా తీసుకొని వచ్చారు..పోలేరమ్మ జాతరకు 300 సంవత్సరాల చరిత్ర ఉంది. పోలేరమ్మ జాతర మతాలకు అతీతంగా జరుగుతుంది. అన్ని మతాలవారు జాతల్లో పాల్గొంటారు. 1700 సంవత్సరంలో వెంకటగిరిలో కలరా రావడంతో అప్పట్లో రాజవంశస్తులు శీతల యాగం చేయించినట్లు పెద్దలు చెబుతున్నారు. కలరా రావడంతో పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరిగింది. శీతల యాగం చేయడంతో అప్పట్లో కలర తగ్గి ప్రజలందరూ ఆనందంగా ఉన్నారు. అప్పట నుండి క్రమం తప్పకుండా పోలేరమ్మ జాతర నిర్వహిస్తున్నారు. శీతల యాగం పేరుతో మొదలుపెట్టిన అమ్మవారి పూజా కార్యక్రమం నేడు జాతరగా మారింది. 1992వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి జనార్దన్ రెడ్డి దేవాదాయ శాఖలో పోలేరమ్మ అమ్మవారి జాతరను విలీనం చేయించారు. అనంతరం మూడు సంవత్సరాల క్రితం జాతరను రాష్ట్ర పండుగ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేయించారు. రాష్ట్ర పండుగ కావడంతో పోలేరమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారు. పోలేరమ్మ అమ్మవారిని పుట్టినిల్లుగా భావించే కుమ్మరి వీధిలో చాకలి కుటుంబీకులు పుట్టపర్తి తెచ్చి తయారు చేస్తారు. అమ్మవారికి ఇక్కడ కళ్ళు పెట్టకుండా ఎలాంటి అలంకరణ చేయకుండా అత్తవారిల్లుగా భావించే చాకలి ఇంటికి అమ్మవారిని జీనుగులు వారి వీధిలో ఉన్న అలంకార మండపానికి తీసుకొని వెళ్తారు. అక్కడ అమ్మవారికి కళ్ళు పెట్టి బంగారు నగలతో అలంకరిస్తారు. అక్కడినుండి లక్షలాది మంది భక్తుల నడుమ రథంపై ఊరేగింపుగా బజారు వీధిలోని పోలేరమ్మ గుడి వద్దకు తీసుకువచ్చిపెట్టి భక్తుల దర్శనార్థం ఉంచుతారు. ఇక్కడ భక్తుల దర్శనార్థం అనంతరం 11వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు పురవీధుల్లో ఊరేగింపుగా నిష్క్రమణకు తీసుకొని వెళ్తారు. లక్షలాది మంది భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కలు చేర్చుకుంటారు. పోలేరమ్మ గుడి వద్ద కూడా అమ్మవారిని లక్షలాదిమంది దర్శనం చేసుకుంటారు. జాతర నిర్వహణకు రాజాల అనుమతిని ప్రతి సంవత్సరం నిర్వాహకులు తీసుకుంటారు, సాంప్రదాయం ప్రకారం పోలేరమ్మ అమ్మవారికి రాజ్యాల నివాసం నుండి చీర, సరే సరవళ్ళు తీసుకొని వెళ్తారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి వెళ్లిన మూడవ బుధ, గురువారాలలో జాతర నిర్వహిస్తారు. ఈ నెల 10,11 తేదీల్లో జాతర జరగనుంది.



### పోలేరమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి : ఈవో

గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర ఈనెల 10,11 తేదీల్లో జరుగుతున్న సందర్భంగా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయం ఈవో ఏవి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు వేసినట్లు చెప్పారు. భక్తుల కోసం కూలర్స్, తాగునీరు ఏర్పాటు చేసినట్లు వివరించారు. వైద్య శిబిరాలు సిద్ధం చేసినట్లు వివరించారు. పట్టణంలో పారిశుధ్యం ఇబ్బందిగా లేకుండా మున్సిపాలిటీ సిబ్బంది చేత ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నట్లు కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. భక్తుల కోసం తాగునీరు పుష్కలంగా అందిస్తున్నట్లు చెప్పారు.

# స్వచ్ఛకుప్పం సాధనకు అందరూ సహకరించాలి

## ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్
## వ్యర్థాల సేకరణకు 80లక్షలతో కంప్యాక్టర్.. 60లక్షల విలువ చేసే ఇ-ఆటోలు !!

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర పిలుపులో భాగంగా స్వచ్ఛకుప్పం సాధనకు ప్రతి ఒక్కరూసహకరించాలని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ కోరారు. మంగళవారం కుప్పం బస్టాండు వద్ద కుప్పం మున్సిపాలిటీకి స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ 80లక్షలతో అందించిన కంప్యాక్టర్ వాహనాన్ని, 60లక్షల విలువ చేసే ఇ- ఆటోలను ఆయన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, కడ సభ్యుడు రాజ్‌కుమార్‌లతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా డా॥ కంచర్ల మాట్లాడుతూ కుప్పం పట్టణం రూపురేఖలు మార్చేందుకు సింగపూర్ సంస్థతో డిపిఆర్ సిద్ధం చేయడం జరుగుతోందన్నారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైన్లు, ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు అందించడంతో పాటు పట్టణ సుందరీకరణ పనులు చేపడ్తామన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై కమీషనర్ చూపుతున్న చొరవను అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్,వేలు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమగళ్, రెస్కో డైరెక్టర్లు ఆర్ముగం, శివ, తులసినాథ్, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, సతీష్, నారాయణ, వెంకటప్ప, బగ్గిడి వెంకటేష్, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.



కంప్యాక్టర్ వాహనంను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కంచర్ల తదితరులు

## రూ.4 లక్షలు విలువ చేసే బాణాసంచా స్వాధీనం
### - ఇద్దరు వ్యక్తులు అరెస్టు

చిత్తూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:
చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తమిళనాడు రాష్ట్రం శివకాశి నుండి అక్రమంగా ఇక్కడికి బాణాసంచా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టుటౌన్ ఇన్స్పెక్టర్ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసి వారి నుండి 4 లక్షల రూపాయల బాణాసంచాతో పాటు ఒక ఈచర్ వాహనంను బుధ వారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా వున్నాయి. జిల్లాలో అక్రమ రవాణా కార్యక్రమాలు కట్టడి చేయడానికి ఎస్పీ మణికంఠ చందోలు కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పోలీసులు జిల్లా అంతటా ప్రత్యేక నిఘా పెట్టారు. ఇందులో భాగంగా చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్స్పెక్టర్ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక ఈచర్ వాహనంను నిలువుదల చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ ఈచర్ వాహనంలో 4 లక్షల రూపాయల విలువైన టపాసులు వుండటంతో వీటిని పోలీసులు స్వాధీనం చేసుకుని విచారించగా తమిళనాడు రాష్ట్రం శివకాశి నుండి ఎలాంటి చట్టపరమైన లైసెన్సులు లేకుండా చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్రాంతాలకు ఈచర్ వాహనంలో దీపావళి పండుగ పురస్కరించుకుని టపాసులు రవాణా చేస్తున్నట్లు తేలింది. ఈ ఈచర్ వాహనంను పోలీసులు పూర్తి స్థాయిలో తనిఖీ చేయగా అందులో 70 బాణాసంచా బాక్సులు వుండటంతో ఆ బాక్సులతో పాటు ఈచర్ వాహనంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి తమిళనాడు రాష్ట్రంకు చెందిన రవికుమార్‌తో పాటు యాదమరి మండలానికి చెందిన ఆర్.మణిగండన్‌ను పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న హెడ్ కానిస్టేబుల్స్ సుధీర్, బాబురెడ్డి, బాబు, కానిస్టేబుళ్ళు రాజేష్, సుబ్రమణ్యంలు, హోంగార్డులు భాష, నాగరాజులను డిఎస్పీ సాయినాధ్ అభినందించారు.



## విద్యార్థుల జీవితాల్లో పురోగతి ఉపాధ్యాయులతోనే
### - ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య దొరస్వామి

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
విద్యార్థుల జీవితాల్లో పురోగతి తేవడం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం. దొరస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ కాలేజ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతూ తాము కొవ్వొత్తిలా కరిగిపోతూనే సమాజానికి సేవ అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌చేతుల మీదుగా పురస్కారం అందుకున్న వి.సి. ఆచార్య దొరస్వామిని అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, సీనియర్ అధ్యాపకులు డివిఎన్ జగదీష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం

పలమనేరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:
పలమనేరు లయన్స్ క్లబ్, చిత్తూరు వెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 14 న ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఉంటుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జయశంకర్, కార్యదర్శి మహమూద్ తెలిపారు. పలమనేరు పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల లయన్స్‌సేవా కేంద్రంలో ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు వైద్యశిబిరం ఉంటుందన్నారు. కీళ్ళ నొప్పులు, నడుం నొప్పులు, మహిళలకు సంబంధించిన వ్యాధులకు చికిత్సలు ఉంటాయన్నారు.

## టెట్‌పై రివ్యూ పిటిషన్ దాఖలు
### - రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్



చిత్తూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:
ప్రభుత్వ ఉపాధ్యాయులు పదోన్నతులు పొందడానికి టెట్ తప్పనిసరి అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ కోశాధికారి వి. రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు మరింత కిష్టంగా మారుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలకు పైగా విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులు ఇప్పుడు టెట్ అర్హత సాధించాలని చెప్పడం అన్యాయమన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై వేలాది మంది ఉపాధ్యాయులు తీవ్ర నిరుత్సాహంగా వున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరం ఈ విషయంపై స్పందించి ఈ తీర్పుపై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయడం లేదా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి చట్టం తీసుకురావాలన్నారు. 2010 నోటిఫికేషన్ తర్వాత నియమితులైన వవారికి టెట్ వర్తింపచేయాలని, సీనియర్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించి ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

## కాప్పల్లె రవీంద్రారెడ్డి సేవలు మరువలేనివి : టిటిడి అదనపు ఇఓ

పలమనేరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:
చిత్తూరు జిల్లా పలమనేరు మండలం కాప్పల్లె రవీంద్రారెడ్డి టిటిడికి చేస్తున్న సేవలు మరువలేనివని టిటిడి అదనపు ఇఓ వెంకటేష్ చౌదరి అన్నారు. మంగళవారం తిరుమల టిటిడి కార్యాలయంలో ఆయన రవీంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ తిరుమల తిరుపతి దేవస్థానం వెంగమాంబ నిత్య అన్నదాన క్షేత్రానికి తరచూ ఉచితంగా కూరగాయలు పంపుతూ భక్తులకు సేవ చేస్తున్నారని తెలిపారు. అలాగే ఈ నెల 24 నుండి జరుగనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయాలని కోరారు. అనంతరం రవీంద్రారెడ్డి బృందానికి ఉచిత దైద దర్శనం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## బాల్యవివాహాల నిరోధానికి కృషి చేయాలి - ఆర్డీఓ

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
సమాజంలో బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు సూచించారు. మంగళవారం కుప్పం మండల కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టం, విద్యాహక్కు చట్టం తదితరాలపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. బాలికలకు వివాహ వయసు రాకుండానే వివాహాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. చిన్నతనంలోనే బాల్య వివాహాలు చేస్తే వారిలో అనారోగ్యం, మానసిక పరిపక్వత లేకపోవడం, చిన్నతనంలోనే పిల్లలకు తల్లులు కావడం వంటివి ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాలు గ్రామాల్లో జరగకుండా కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. బాల్యవివాహాలు చేపడితే తల్లిదండ్రులతో సహా రెండేళ్ల జైలుశిక్ష విధించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు చేసుకునేవారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరుగుతుందని డిసిపిఒ డా॥ సుబ్రమణ్యం దాసరి పేర్కొన్నారు. కార్యక్రమంలో డెమో జయరాముడు, ఎల్‌సిపిఓ వెంకటేశులు, పిఓఎన్ఐసి శివశంకర్, ప్రొటెక్షన్ అధికారిణి రాధారాణి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ చందురాణి,డిసిపిఓ సుబ్రమణ్యం, తహశీల్దార్లు చిట్టిబాబు, సీతారాం, ఎంపిడిఒలు విజయదత్, పిఆర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సభకు పలమనేరు డిపో ఆర్టీసీ బస్సులు
### విద్యార్థులకు ప్రజలకు తప్పని తిప్పలు

పలమనేరు టౌన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:
అనంతపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు పలమనేరు ఆర్టీసీ డిపో నుండి బస్సులు తరలివెళ్ళాయి. ఈ నెల 10న అనంతపురంలో బహిరంగ సభ ఉంటుందని తెలియడంతో పలమనేరు డిపోలో మొత్తం 59 బస్సులుండగా ఇందులో 41బస్సులు అనంతపురం సభకు పంపారు. ఈ విషయంపై డిపో మేనేజర్ స్వామి మాట్లాడుతూ అనంతపురం సభకు 41 బస్సులు పంపిన విషయం వాస్తవమేనన్నారు. ఐతే డిపోలో బస్సులు దాదాపు 75 శాతం తరలివెళ్ళడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకుల అవస్థలు వర్ణనాతీతం, ఆర్టీసీ బస్టాండుతో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీచే పిఇఎస్ విద్యార్థినికి పురస్కారం



కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
డా॥ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన 28వ వార్షిక స్నాతకోత్సవంలో కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో ఫైనలియర్ ఎంబిబిఎస్ చదువుతున్న ముడిపల్లి సాయి జాహ్నవి విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. 2023లో జరిగిన ఫస్ట్ ఇయర్ ఎంబిబిఎస్ పరీక్షల్లో జాహ్నవి యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ విద్యార్థినిగా నిలిచారు. దీంతో ఆమెకు కవూరి హేమావతి,కవూరిచలపతి రావు పురస్కారంతో సత్కరించారు. జాహ్నవికి పురస్కారం రావడం పట్ల పిఇఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఎం కృష్ణారావు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

## రైతులకు యూరియా సక్రమంగా అందించాలి - ఎమ్మెల్సీ భరత్

కుప్పం, సెప్టెంబర్ 9ప్రభాతవార్త



రాష్ట్రంలో రైతులకు యూరియా,ఎరువులను సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ భరత్ మంగళవారం కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజుకు వినతిపత్రం అందించారు. అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా అందక రైతులు అవస్థలు పడుతున్న విషయంగా తాము రైతులకు మద్దతుగా కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో మండల వైకాపా అధ్యక్షులు హెచ్ఎం మురుగేష్, బాబురెడ్డి, దండపాణి, మాజీ రెస్కో ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, రాష్ట్ర వన్నియకులక్షత్రియ విభాగం అధ్యక్షుడు హెచ్ఎం శ్రీను, కౌన్సిలర్లు మునిరాజు, మణి తదితరులు పాల్గొన్నారు. కాగా కుప్పంలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున కొంతమంది వైకాపా నేతలను మాత్రమే ఆర్డీఓను కలిసేందుకు పోలీసు అధికారులు అనుమతించారు.

## నిబంధనల ప్రకారమే ఆశాకార్యకర్తను నియమించాలి

చౌడేపల్లి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఆశా కార్యకర్తను నియమించాలని గ్రామస్తులు కోరారు. మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దయల్లకుంట్లలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న లక్ష్మీదేవి ఇటీవల మరణించింది. దీంతో అక్కడ పనిచేసేందుకు ఆశా కార్యకర్త పోస్టు కోసం ధరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. దీంతో అనర్హత కల్గిన మహిళను తమ పంచాయతీలో నియమించారనీ, విచారణ చేసి అర్హతగలవారిని ఎంపిక చేయాలని గ్రామస్తులు మండల వైద్యాధికారిణి మోనాకు వినతిపత్రమందించారు. సురేష్, ఓబుల్‌రెడ్డప్ప, సురేంద్ర, శ్రావణి తదితరులు వినతిపత్రమందించిన వారిలో వున్నారు.

## వైకాపా రాజకీయ లబ్దికే తప్పుడు ప్రచారాలు - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
రాష్ట్రంలో ప్రతి కార్యక్రమాన్ని రాజకీయం చేసి లబ్ది పొందాలని వైకాపా తప్పుడు ప్రచారాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉనికి చాటేందుకై ఫేక్ ప్రచారాలు, కుట్రలతో కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణమన్నారు. ఐదేళ్ల పాలనలో కనీసం పొలంలో అడుగు పెట్టని జగన్ ఇపుడు రైతుల కష్టాలు అంటూ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు ఎరువులు సక్రమంగా జరుగుతోందన్నారు.6.11లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు రాష్ట్రంలో వినియోగించారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేకున్నా కావాలనే ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఇది మంచిది కాదన్నారు. ప్రజలు, రైతులు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు.

## షికారిల వ్యవసాయంపై ఫారెస్ట్ అధికారుల ఆక్షేపణ

పుంగనూరు సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
మండలంలోని పాలెం పల్లె పంచాయతీ కు చెందిన షికారి కుటుంబాల వ్యవసాయంపై పుంగనూరు ఫారెస్ట్ అధికారులు తీవ్ర ఆక్షేపణలకు దిగారు. మంగళవారం మధ్యాహ్నం షికారి పాలెం కు చేరుకున్న అటవీ అధికారులు పాలెం పల్లె షికారి పాలెం లో షికారులు వ్యవసాయం చేస్తున్న భూములు అటవీ పరిధిలోకి వస్తాయని తాము సర్వే చేసేంతవరకు వ్యవసాయ కార్యక్రమాలు నిలిపివేయాలని నోటీసులు ఇచ్చారు. దీంతో గ్రామంలోని షికారులు తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం ఇక్కడ భూములు కేటాయించిందని,ఈ భూములలో తాము అనేక ఏళ్లుగా వ్యవసాయం సాగించుకుంటూ జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. ఇలా అటవీ అధికారులు ఉన్నపలంగా ఊడి వచ్చి తమ వ్యవసా యాలపై అభ్యంతరాలు తెలియజేయడం దారుణమని గ్రామస్తులు ఆవేదన చెందారు. పంటల సమయంలో అధికారులు వచ్చి గ్రామంలో తీవ్ర ఆక్షేపణలు తెలియజేయడం దారుణం అన్నారు. కొండ కోనల్లో జీవిస్తూ ఇప్పుడిప్పుడే వ్యవసాయం బాట పడుతున్న షికారి కుటుంబాలను వ్యవసాయానికి దూరం చేయడం వల్ల తాము మళ్ళీ రోడ్డున పడాల్సి వస్తుందని గ్రామస్తుల ఆవేదన చెందారు. అటవీ అధికారులు తమకు ప్రభుత్వం కేటాయించిన భూములను గుర్తించాలని, సర్వే కార్యక్రమాలను రద్దు చేయాలని షికారీలు డిమాండ్ చేశారు.



## జిఎస్టీ తగ్గింపుతో పేద కుటుంబాలకు ప్రయోజనం
### - బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల వస్తువులపై జిఎస్టీ శాతం తగ్గించడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యంత ప్రయోజనం కలుగుతుందని కుప్పం బిజెపి ఇన్‌చార్జ్, రెస్కో డైరెక్టర్ తులసినాథ్ పేర్కొన్నారు. 330కు పైగా వస్తువులకు జిఎస్టీ తగ్గింపుతో పాటు భీమా పాలసీలపై కేంద్రం జిఎస్టీ తీసేయడం శుభపరిణామమన్నారు. ప్రధాని మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయంతో ప్రజలు, రైతులకు లబ్ది కలుగుతుందన్నారు. ఆయన ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

సదుం సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పులిచెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ వాణి శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సదుం లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మిషన్ శక్తి సంకల్ప , బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా కిశోరీ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ సమాజంలో బాలికల పట్ల అసమానతలను విడనాడాలన్నారు. చిన్నతనంలోనే బాలురు మరియు బాలికలలో సమాన భావాన్ని పెంపొందించాలన్నారు. బాల్య వివాహాలు నిర్మూలించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, బాలికలకు యుక్తవయసు కాకుండా వివాహాలు జరిపితే పలు ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం సుబ్రహ్మణ్యం, యుగంధర్, హేమలత, సూపర్వైజర్ మల్లీశ్వరి ,అంగన్వాడీ టీచర్లు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా చక్రపాణిరెడ్డి

శాంతిపురం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా కుప్పం రెస్కో మాజీ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి పేరును ప్రతిపాదించినట్లు ఎమ్మెల్సీ భరత్ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు రాయలసీమ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి లేఖ రాయడం జరిగిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి చక్రపాణిరెడ్డి పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం జరుగుతుందన్నారు.



## ఉత్తమ.. పదోన్నతి ఉపాధ్యాయులకు ఘన సత్కారం

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
స్థానిక డికెపల్లి ప్రైమరీ స్కూల్ పిఎస్‌హెచ్ఎంగా పనిచేస్తూ బాలికల హైస్కూల్ హెచ్ఎంగా పదోన్నతి పొందిన అమరజ్యోతి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పిఎస్‌హెచ్ఎం రవీంద్రనాయుడు, ఉపాధ్యాయురాలు సరళను మంగళవారం ఉపాధ్యాయులు ఘన ంగా సత్కరించారు. అలాగే బదిలీ అయిన రామచంద్ర, రామసుబ్రమణ్యంలను సైతం సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆవుల కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## హైరిస్క్ గర్భిణీలకు పక్కాగా వైద్య సేవలు
### - డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి

చిత్తూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:
క్షేత్ర స్థాయిలో హైరిస్క్ గర్భిణీలను త్వరితంగా నమోదు చేసి వారికి పక్కాగా వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి పేర్కొన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జననీ సురక్ష యోజన కన్వర్జన్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి కాన్పు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరికి జెఎస్‌వై పేమెంట్ పట్టణ ప్రాంతాల్లో రూ.800, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1000 డిబిటిల ద్వారా చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ రోజారాణి, డాక్టర్ రామ్మోహన్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు, వైద్యులు, ఏరియా ఆసుపత్రుల సూపరిటెండెంట్లు, ఏరియా ఆసుపత్రుల డాక్టర్లు, డిఇఓలు తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణీలకు పక్కాగా పరీక్షలు

యాదమరి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:
గర్భిణీ స్త్రీలకు పిఎంఎస్ఎంఎ కార్యక్రమం కింద పక్కాగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సుఖ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని యాదమరి పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. యాదమరి పిహెచ్‌సి ఆవరణలో బుధవారం డాక్టర్ అనిల్‌కుమార్ ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గర్భిణీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణీలకు అవసరమైతే స్కానింగ్ నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శ్రీనివాసమూర్తి, ఎంఎల్‌హెచ్‌పిలు దుర్గ ప్రసన్న, విష్ణుప్రియ, భానుప్రియ, దివ్య, సౌందర్య, దిల్షాద్, హెల్త్ సూపర్‌వైజర్స్ లక్ష్మీపతి, సెల్వరాణిలు, ఎఎన్ఎంలు శైలజ, శిల్ప, సరస్వతి, జ్యోతిలు, స్టాఫ్ నర్స్ ప్రభావతి, ఫార్మసిస్ట్ శైలశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి 63 మంది గర్భవతులు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు.

## మద్యం సేవించి పట్టుబడిన వారి నుండి రూ.1.10 లక్షలు వసూలు

చిత్తూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:
చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 11 మందికి ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 1.10 లక్షల రూపాయల జరిమానాను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి విధించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ వెల్లడించిన వివరాల మేరకు చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహిస్తుండగా వివిధ ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు 11 మంది పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టు ఎదుట హాజరు పరిస్తే జడ్జి వీరు ఒకొక్కరికి 10 వేల రూపాయలు జరిమానా విధించడం జరిగిందన్నారు.

## బిసి కార్పొరేషన్ డైరెక్టర్‌గా జి. అమర్నాథ్



సదుం సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవులలో సదుం మండలానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడికి కార్పొరేషన్ డైరెక్టర్ గా పదవి లభించింది. రెడ్డివారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ జి అమర్నాథ్ వెనుకబడిన తరగతుల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్గా ప్రభుత్వం నియమిం చింది. ఈ మేరకు ఆయనకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చా యి. అమర్నాథ్ రెడ్డి వారి పల్లె పంచాయతీకి రెండుసార్లు సర్పంచిగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్ని కష్టాలు వచ్చినా అక్రమ కేసులు పెట్టిన తెలుగుదేశం పార్టీలో ఉన్నానని చెప్పారు. చంద్రబాబు పుంగనూరు పర్యటన సందర్భంగా పోలీసులు అక్రమంగా పెట్టిన కేసులో 28 రోజులు కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదుగా ఉన్నానని చెప్పారు. తనకి పదవి రావడానికి కారణమైన ముఖ్యమంత్రి చంద్రబాబుకూ మంత్రులు లోకేష్, రాంప్రసాద్‌రెడ్డికి, పుంగనూరు టిడిపి ఇన్చార్జి చల్లా రామచంద్ర రెడ్డి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు 5కె మారథాన్

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:
యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రం చిత్తూరులో బుధవారం ఉదయం 5.30 గంటల నుండి 7.30 గంటల వరకు 5కె మారథాన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ 5కె మారథాన్‌లో 100 నుండి 150 మంది విద్యార్థులు, యువజన సమూహాలు పాల్గొనడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని, మెసానికల్ గ్రౌండ్ నుండి పివికెఎన్ డిగ్రీ కళాశాల వరకు అక్కడి నుండి మళ్ళీ మెసానికల్ గ్రౌండ్ వరకు 5కిమీ మారథాన్‌రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఐడిపిబి విద్యార్థులు

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త



నేపాల్ దేశంలోని పోకార రాష్ట్రంలో ఈనెల 11నుంచి జరిగే అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు కుప్పం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు జోశ్విక్,సాయి అశ్వంత్, తేజ్ రిషిత్, అర్జున్‌లు స్కూల్ ఛైర్మన్ బిఎం దయానిధితో కలసి ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, పికె ఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబులను కలిశారు. ఈసందర్భంగా డా॥ కంచర్ల మాట్లాడుతూ కుప్పం విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. కుప్పం నుంచి ఇతర దేశాలకు వెళ్లి క్రీడల్లో పాల్గొనే అవకాశం అరుదుగా వస్తుందన్నారు. కుప్పంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆధునాతన రీతిలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు కడ పి.డి. వికాస్ మర్మత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కడ సభ్యులు వెంకటేష్, సతీష్, కౌన్సిలర్ సురేష్, ప్రిన్సిపాల్ డా॥ అరుణ్ రాజ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు మానాలి
### - టిడిపి మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

కుప్పం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
రైతులకు ప్రభుత్వం యూరియా అందించడం లేదనే తప్పుడు ప్రచారాలను వైకాపా మానుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చందంలోని రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ప్రభుత్వంపై చెడు అభిప్రాయం ఏర్పడేలా వైకాపా శత ప్రయత్నాలు చేస్తోందని అయితే ప్రజలు వైకాపాను విశ్వసించే స్థితిలో లేరన్నారు. రైతులు కూడా యూరియా వినియోగం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు రాధాకృష్ణమూర్తి, మేఘనాథన్, తులసిబాబు, చల్లప్ప, గురుస్వామి, మోహన్, రైతులు పాల్గొన్నారు.



## రూ.30 లక్షల అక్రమ టపాసులు సీజ్

పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త



దీపావళి పండుగకు అనుమతులు లేకుండ ముందుగా టపాకాయల నిల్వలపై చిత్తూరు ఎస్బి అధికారి సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దాడులు చేసి సుమారు రూ.30 లక్షలు విలువ చేసే టపాకాయలు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని టపాకాయల వ్యాపారీ డీష్బాబు, శ్రీధర్ గుప్తా, రాఘవేంద్ర సప్లయర్స్ అనుమతులు లేకుండ నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.30 లక్షలు విలువ చేసే టపాకాయలను నిల్వ చేసి ఉండటంపై ఫిర్యాదులు అందిందని, ఈ మేరకు సీఐ సుబ్బరాయుడు, పోలీసులతో కలసి దాడులు చేసి, సీజ్ చేశామని తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. చట్టవ్యతిరేకంగా టపాకాయల విక్రయాలు, నిల్వలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. కాగా పట్టణంలో సుమారు రూ.30 లక్షల రూపాయల విలువ చేసే టపాకాయలు సీజ్ చేయడం సంచలనం రేకెత్తించింది.

## రైతు సంఘాలకు యూరియాను సరఫరా చేయాలి

చౌడేపల్లి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త
మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రభుత్వం ప్రత్యేకించి యూరియాను సరఫరా చేయాలని సంఘం తీర్మానించింది. స్థానిక వెలుగు కార్యాలయం పరిధిలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం జరిగింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో మండల వ్యాప్తంగా 2300మంది రైతులున్నారనీ, ప్రభుత్వ ఇటీవల పంపిణీ చేస్తున్న యూరియా అందరికీ అందలేదన్నారు. తమ సంఘాల ద్వారా మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. సంఘం అధ్యక్షుడు జంగాలపల్లి వెంకట్రమణ, బిఓడిలు కృపాకర్‌రెడ్డి, మునెప్ప, ప్రభాకర్‌రెడ్డి, సంఘంలోని రైతులు పాల్గొన్నారు.



# తిరుపతి డివిజన్



## వాంపల్లిలో చోరీ

శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: మండలంలోని వాంపల్లి గ్రామం నందు సోమవారం రాత్రి కరణం బుజ్జమ్మ ఇంట్లో చోరీ జరినట్లు రూరల్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఆరోగ్యం సరిగాలేని కారణంగా తిరుపతిలో వున్న తమ కుమార్తె వద్దకు వెళ్ళానని, అయితే దొంగలు తమ ఇంటిలోనికి ప్రవేశించి తన బీరువాలో వున్న బంగారు తాళిబొట్టు (5గ్రా), గుండ్లు (1గ్రా) కమ్మలు ఒక జత (4గ్రా), మరో జత కమ్మలు (3గ్రా), ముత్యాలదండ (7గ్రా) మొత్తం 2.5 సవరల బంగారాన్ని తీసుకెళ్ళినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీ ఫిర్యాదుతో మంగళవారం సిఐ గోపి తన సిబ్బందితో వెళ్ళి, బుజ్జమ్మ ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## బస్సులు అనంతపురానికి... యాత్రికుల తిప్పలు వర్ణనాతీతం



తొట్టంబేడు,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నుంచి ఆర్‌టిసి బస్సులను అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ విజయవంతం సభకు తరలించగా ప్రయాణీకులు, భక్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. శ్రీకాళహస్తి నుంచి చుట్టుపక్కల గ్రామాలకు భక్తులు బస్సుల్లో వెళుతుంటారు. ముఖ్యంగా తిరుపతి నుంచి బస్సులు తిరుగుతుంటాయి. మంగళవారం ఉదయం నుంచి శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండులో తీవ్ర రద్దీ చోటు చేసుకుంది. ఉన్న బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణీకులు ఎక్కటానికి ప్రయత్నించటంతో ఇబ్బంది ఏర్పడింది. ఇక్కడి ఆర్‌టిసి డిపో నుంచి 50 బస్సులను అనంతపురం సభకు తరలించినట్లు సమాచారం.శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న భక్తులు తిరిగి తిరుపతి చేరటానికి నానా తిప్పలు పడ్డారు.

## సీడ్స్ సర్కిల్ వద్ద మద్యం బార్ వద్దు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఏపి సీడ్స్ కార్పొరేషన్ ఆర్చి కూడలి వద్ద ప్రభుత్వం కొత్తగా బార్ ఏర్పాటుకు ప్రకటించటం శోచనీయం అని ఆందోళన చేసారు. పలువురు మహిళలతో కలసి నివాసాల మధ్య మద్యం దుకాణాలు, బార్‌లు ఏర్పాటు చేయవద్దంటూ ఆందోళన జరిపారు. అసలే కూడలి,మహిళలకు రక్షణ లేకుండా ఉందన్నారు. ఇక్కడ దుకాణం ఏర్పాటు విరమించుకునే వరకు మహిళలు ఆందోళనలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. అబ్కారి శాఖ అనాలోచిత నిర్ణయాలతో మహిళలను ఇబ్బంది కల్గిస్తున్నారని ధ్వజమెత్తారు.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థికి శివయ్య తీర్థ ప్రసాదాలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: భారత దేశ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నానినేషన్ దాఖలు చేసిన కూటమి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్‌కు మంగళవారం రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ శివయ్య ప్రసాదాలను అందించారు. న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో కోలా ఆనంద్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. మర్యాద పూర్వకంగా కలసిన కోలా ఆనంద్ రాధాకృష్ణన్ పేరుతో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ప్రత్యేకాభిషేకాలు పూజలు జరిపించారు. తీర్థ ప్రసాదాలను మంగళవారం ఆయన నివాసంలో అందించారు. అలాగే కలంకారి వస్త్రంతో సత్కరించి, ఆయనతో పాటు శ్రీరామమందిరాన్ని రాధాకృష్ణన్‌తో కలసి దర్శించుకున్నారు.

## నేటి నుంచి గురువైభవం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి సమీపంలోని శుకబ్రహ్మాశ్రమం సారథ్యంలో ధార్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి మంగళవారం వివరించారు.ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ఏడు రోజుల పాటు ధార్మిక ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పట్టణ నడిబొడ్డులోని ముత్యాలమ్మగుడి కళ్యాణ మండపంలో 'గురువైభవం' ధార్మిక కార్యక్రమాలను నిర్వహించుటకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉపన్యాసకులుగా నంబూరు కాళ్ళవన ఆశ్రమ పీఠాధిపతి యోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ నిర్వహించబడు తుందన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు జరుగుతుందని వివరించారు.ఈ ధార్మిక కార్యక్రమాలు విద్యావికాస పరిషత్ సారథ్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రైతుల నేడు గుర్తుకు వచ్చారా?



తొట్టంబేడు,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: అధికారంలో ఉన్నప్పుడు వరదలొచ్చినా, వర్షాలొచ్చినా పరదాల చాటున పరిశీలనలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి నేడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని తొట్టంబేడు వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులు జయచంద్రానాయుడు ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో రైతులు పడ్డ అగచాట్లు వారిని అడిగితే చెబుతారన్నారు. నేడు ముఖ్యమంత్రి వ్యవసాయశాఖ మంత్రి రైతులకు అందించాల్సిన సదుపాయాల్ని అందిస్తుంటే వైకాపా నాయకులు యాగీ చేయటం వారి దివాలాకోరుతనానికి నిదర్శనం అన్నారు.నేడు రాష్ట్రంలో రైతుల కోసం వ్యవసాయ పనిముట్లు సబ్సీడితో ఇవ్వటం జరుగుతుందన్నారు. పభుత్వం సహకార సంఘాల ద్వారి రూ.270లకే బస్తా యూరియా అందిస్తుంటే బ్లాక్ మార్కెట్ అంటూ విమర్శించటం తగదన్నారు.

## దేశం నాయకురాలిని పరామర్శ



తొట్టంబేడు,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: మండలంలోని తెలుగుదేశం నాయకురాలు అంకమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మండల మాజీ తెలుగుదేశం అధ్యక్షుడు గాలిమురళి నాయుడు పరామర్శించారు. మంగళవారం ఆయన శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లతో అంకమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## మెడికల్ విద్యార్థిని అభినందన



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: మండలంలోని ఊరందూరు దళితవాడకు చెందిన భరత్ కష్టపడి చదివి ఉచితంగా మెడికల్ సీట్ సాధించారు. ఆ యువకుని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు సత్కరించారు.దళిత వాడకు చెందిన రంగయ్య కుమారుడు భరత్ ఎంబిబియస్ సీటును సాధించారు.

## దోమల ఉత్పత్తి కాకుండా జాగ్రత్త చర్యలు : డాక్టర్లు



నారాయణవనం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడిన కారణంతో దోమల ఉత్పత్తి అధికంగా వుందని స్థానిక పిహెచ్‌సి డాక్టర్లు దర్శిత్‌రాజ్, రాగసుధలు తెలిపారు. మంగళవారం మండలంలోని కశింమిట్ట దళితవాడను స్థానిక వైద్యబృందం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఇటీవల కురిసన వర్షం వల్ల దోమల ఉత్పత్తి పెరుగడం వల్ల వైరల్ ఫీవర్ వస్తున్నట్టు చెప్పారు. దోమలకాటు వల్ల మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ జ్వరాలు వస్తున్నట్టు చెప్పారు. సిహెచ్‌ఓ హరినాథ్, సిబ్బంది సుధాకర్, సరోజ, రాణి తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు భరోసా : ఎమ్మెల్యే



పుత్తూరు రూరల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త: పుత్తూరు మున్సిపాలిటీ 2వ వార్డు కేఎం అగ్రహారంకు చెందిన అంగన్‌వాడీ వర్కర్ అంబిక కుమారుడు చిరంజీవి అనారోగ్యం పాలై చెన్నైలో గల విజయ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడంతో ఆర్థిక భారం ఎక్కువై కుటుంబ జీవనం కూడా కష్టంగా ఉన్న తరుణంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4.83 226 రూపాయలను మంజూరు చేయించి మంగళవారం చెక్కును ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గణేష్, రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కుడుకుప్పం షణ్ముగరెడ్డి, జిల్లా బీసీసెల్ కార్యదర్శి మహేష్, నాయకులు భాస్కర్, అశోక్, భాగ్యరాజు, ధనశేఖర్, కార్తీక్, ధనలక్ష్మి, గీత, శాంతి, గ్రామ యువకులు మహిళలు పాల్గొన్నారు.

## అన్నదాత పోరులో కదంతొక్కిన వైసిపి శ్రేణులు

-తిరుపతి చంద్రగిరి నియోజకవర్గాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు
-రూ.200రుపాయాలు బ్లాక్‌లో యూరియా రూ.600రుపాయాలు
-తిరుపతిలో అన్నదాత పోరు విజయవంతం



తిరుపతిరూరల్,సెప్టెంబర్9 ప్రభాతవార్త: అన్నదాతకు బాసటగా నిలుస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అన్నదాత పోరు తిరుపతిలో విజయ వంతంగా జరిగింది. తిరుపతి, చంద్రగిరి నియోజక వర్గాల నుంచి వైసిపి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై, నిరసన గళాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వైసిపి ఇన్‌ఛార్జిన భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు మొదలైనాయని ఆవేదన వ్యక్తం చేసారు. రైతు సేవా కేంద్రాలు వద్ద విరివిగా అందాల్సింది పోయి, కృతిమ కొరతను సృష్టిస్తున్నారని వాపోయారు. రూ.267 రుపాయాల యూనియాను బ్లాక్ మార్కెట్‌లో రూ.600 రుపాయాలకు విక్రయిస్తున్నారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు మద్దతుగా పోరాటం చేస్తుందని తెలిపారు. బహిరంగంగా బ్లాక్‌లో అధికధరలకు యూరియా విక్రయిస్తున్నా...కూటమిని నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని, రైతుల పట్ల ఎంత చులకనని ప్రశ్నించారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మొన్న మామిడి రైతులను ఇబ్బంది పెట్టింది...నేడు వరి రైతులను ఇబ్బంది పడేవిధంగా చేస్తున్నారని మండిపడ్డారు. అన్నం పెట్టే రైతులను ఇబ్బంది పెట్టడం బాధాకరమని, కూటమిని ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే రైతులు కన్నీరు పెట్టక తప్పదని, మరోసారి ఋజువు చేసారన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసి అండగా నిలుస్తుందని తెలిపారు. వ్యవసాయం సాగులో కూటమి ప్రభుత్వం రైతన్నకు చేస్తున్న మోసాలు ప్రజలందరికి అర్థమయ్యేలా వివరిస్తామని తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం దేవుడెరుగు...ఎరువులు అందించక కృత్రిమ కొరత సృష్టించడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల కష్టాలు తీర్చకపోతే... రైతు పక్షాన నిలబడిన ఉద్యామాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తిరుపతి ఆర్డీఓకు వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషా, వైసిపి తిరుపతి అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, తిరుపతిరూరల్ వైసిపి అధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వరరెడ్డి, తిరుపతిరూరల్ ఉప మండలాధ్యక్షుడు విదుదల మాధవరెడ్డి పెద్దఎత్తున వైసిపి శ్రేణులు పాల్గొన్నాయి.

## ప్రపంచ ఆత్మహత్య నిరోధక దినోత్సవ ర్యాలీ



తిరుపతి హెల్త్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త : ప్రపంచ ఆత్మహత్య నిరోధక దినోత్సవం-2025 సందర్భంలో తిరుపతి డీఎంహెచ్‌వో కార్యాలయ ఆధ్వర్యంలో ఆత్మహత్యలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఎస్వీ ఐఎంఎస్ సర్కిల్ వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్, డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు , ఎన్‌సీడీ పీవో డాక్టర్ రెడ్డి ప్రసాద్, డీఎంహెచ్స్ సైకియాట్రిస్ట్ డాక్టర్ పి. ఉదయ్ కిరణ్, ఇతర ఆరోగ్య కార్యదర్శులు, మానసిక ఆరోగ్య నిపుణులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త : జిల్లాలో అనుకోని సంఘటనలు జరిగినపుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ, డివిజన్, మండల స్థాయి అధికారులతో వర్చువల్‌గా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీలు తదితర అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్యలతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా ఏమి జరిగినా సంబంధిత హెల్త్ అధికారులు, అనధికారులు, సిబ్బంది వీఆర్వోల ద్వారా సచివాలయ సిబ్బంది, గ్రామ స్థాయిలోని అంగన్‌వాడి, ఆశావర్కర్ల ద్వారా తెలుసుకుని వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డెప్యూటీ స్పెషల్ కలెక్టర్ రోజ్‌మాండ్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన్ డీన్‌గా డాక్టర్ అలోక్ సచన్ నియామకం



తిరుపతి హెల్త్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త : స్విమ్స్ యూనివర్శిటీ నూతన డీన్‌గా స్విమ్స్ ఎండ్రాక్రోనాలజీ విభాగాధిపతి డాక్టర్ అలోక్ సచన్ నియమితులయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్.వి కుమార్ అభినందనలు తెలిపారు. ఇది వరకు డీన్‌గా కొనసాగిన మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అల్లాడి మోహన్, డీన్‌గా వారి పదవీ కాలం ముగియడంతో మంగళవారం డీన్‌గా డాక్టర్ అలోక్ సచన్ బాధ్యతలు స్వీకరించారు.

## పింక్ బస్సు సేవలు సద్వినియోగం చేసుకోండి



రామచంద్రాపురం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: స్విమ్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 కమ్మపల్లి పిహెచ్‌సిలో నిర్వహించనున్న పింక్ బస్సు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమ్మపల్లి వైద్యాధికారి డాక్టర్ చక్రప్రకాష్‌రెడ్డి కోరారు. మంగళవారం కమ్మపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు క్యాంపు ప్రారంభమవుతుందని అన్నారు. పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ, పాప్‌స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. క్యాంపుకు హాజరయ్యే వ్యక్తులు తమ ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ వెంట తీసుకురావాలన్నారు.

## రైతులు భూసార ఆధారిత ఎరువులు వినియోగించాలి!

రామచంద్రాపురం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని భూసార ఆధారిత ఎరువులను వినియోగించాలని ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం చిత్తూరు కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారావు సూచించారు. మంగళవారం పి.వి.పురం, సంజీవరాయపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది, భూరక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో సిఫార్సు చేసిన యూరియాను ఎకరానికి 105 కేజీలు వాడాలని అన్నారు. రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు, పచ్చిరొట్టె ఎరువులు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మమత, మాదవి, రైతు సేవా కేంద్రం విహెచ్ఏ జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



భాకరాపేట సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: చిన్న గొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్ మరియు అరవింద్ నేత్రాలయ తిరుపతి వారు నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు గౌరిశంకర్, సీతారాం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ మంగళవారం నిర్వహించిన శిబిరంలో డాక్టర్లు ఆమని, మానసలు రెండు వందలయబై మందిని పరీక్షించి నూట యానబై మందులు కంటి అద్దాలు ఇచ్చామని మిగతా వారికీ ఆపరేషన్ చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ట్రస్ట్ సభ్యులు కృష్ణ జీవన్ పాల్గొన్నారు

## జంక్ ఫుడ్స్‌కు... దూరమై ఆరోగ్యంగా ఉండాలని




తిరుపతి రవాణా, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: జిల్లా వినియోగదారుల సమాచార కేంద్ర ఆధ్వర్యంలో, బాలాజీ కాలనీలో గల ఎస్వియు క్యాంపస్ స్కూల్ కన్స్యూమర్స్ క్లబ్ సమావేశం జరిగినది, ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు, పి. రాజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండి వినియోగ విజ్ఞానాన్ని, నాణ్యమైన వస్తువును కొనుగోలు చేయడం ,సేవా లోపాల్ని ప్రశ్నించడం, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కావలసిన విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించడమే వినియోగ దారుల క్లబ్ ప్రధానోద్దేశంతోనే ఏర్పాటు చేయబడినదని, ప్రతి విద్యార్థి బాధ్యతతో మెలిగి నష్టం జరిగినప్పుడు ఎలాంటి ఫీజు లేకుండా జిల్లా వినియోగదారుల (ఫోరం ) కమిషన్ లో ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందే అవకాశం గల ఫోరం సేవలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరికి తెలియచేయాలని కోరారు. నేడు ఎక్కడ చూసినా విచ్చలవిడిగా విక్రయిస్తున్న జంక్ ఫుడ్, పిజ్జా,బర్గర్,గోబీ,నూడిల్స్, తక్కువ ధరకు విక్రయిస్తున్న బిర్యానీలు వీటిలో ఉపయోగించే రుచికి వాడే టేస్టీ సాల్ట్, రంగులు, నిల్వ ఉండటానికి వాడే రసాయనాల వల్ల, ఉబకాయము ,బుద్ధి మాంద్యం, జీర్ణ కోసం వ్యాధులు, క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘ ప్రతినిధి దాస ముని రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి షకీలా, క్లబ్ టీచర్ గైడ్స్, కే .సోమేశ్వరరావు రాధమ్మ,అరుణ, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 12న రాయలసీమ రంగస్థలి స్వర్ణోత్సవ కళ నృత్యోత్సవాలు




తిరుపతి రవాణా,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : రాయలసీమ రంగస్థలి స్వర్ణోత్సవ నృత్య కళోత్సవ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 12 నుంచి 14 వరకు టీటీడీ సౌజన్యంతో స్థానిక మహతి ఆడిటోరియం నందు శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ వేదికపై రాయలసీమ రంగస్థలి స్వర్ణోత్సవ నృత్య కలోత్సవాలు వైభవంగా జరగనున్నాయి.ఈ కళోత్సవాల గోడపత్రికలను మంగళవారం గాంధీ రోడ్డు లోని భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యాలయం నందు బిఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఆకుల సతీష్ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాద్ రెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కే ఎన్ రాజా, తొండమనాటి సుబ్రహ్మణ్యరెడ్డి, కారణాతం మురళి కృష్ణ పురోహితుడు సురేష్ స్వామి, కొట్టె సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తుడా ప్లాట్స్ ఈ వేలంకు విశేష స్పందన



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: రేణిగుంట-తిరుపతి హైవే పద్మావతి నగర్‌లోని సూరప్పకసం తుడా లేఅవుట్ లోని తుడా స్థలాలను ఈ వేలం ద్వారా విక్రయిస్తున్నారు. ఈనెల 4న ప్రారంభమైన ఈ వేలం 17వ తేదీతో ముగియనున్నది. 277 ప్లాట్లు అమ్మకానికి ఉంచారు. ఇప్పటివరకు 35 ప్లాట్స్ అమ్మకం జరగగా దాదాపు 13కోట్ల రూపాయలు తుడాకు ఆదాయం లభించింది. ఈ వేలం ప్రక్రియను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి గారు మంగళవారం పరిశీలించారు. ఈ వేలం వివరాలను తుడా సెక్రటరీ డాక్టర్ ఎస్వి శ్రీకాంత్ బాబు తుడా చైర్మన్ గారికి వివరించారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చదరపు గజం 14 వేల రూపాయలు నిర్ణయించడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తుడా చైర్మెన్ కోరారు.

## అనంతపురం సభ సక్సెస్‌లో భాగస్వామ్యంకండి : ఎమ్మెల్యే



తిరపతి విద్య,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: అనంతపురంలో బుధవారం సాయ ంత్రం జరగనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభను సక్సెస్ చేసేందుకు ఎన్డీఏ కూటమి పార్టీలు ఫోకస్ పెట్టాయి. జనసేన పార్టీ రాయలసీమలో తనకు ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలను అనంతపురంకు తరలించింది.బహిరంగ సభ ఏర్పాట్లను జనసేన ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు,అరణి శ్రీధర్‌లు ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి పరిశీలించడంతో పాటు జనం తరలింపుపై మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ లతో కలిసి చర్చించారు. సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, అరణి శ్రీధర్‌లు పిలుపునిచ్చారు.

## బొంగాని కిరణ్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం



తిరుపతి విద్య,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, భౌతిక శాస్త్ర విభాగం, పరిశోధక విద్యార్థి బొంగాని కిరణ్ కుమార్ కు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బి. రాజమాణిక్యం తెలిపారు. ఈయన ప్రొఫెసర్. బి.దేవప్రసాద్ రాజు పర్యవేక్షణలో ఆప్టికల్ అండ్ లుమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ నియోడియం, ఇటర్బియం, నియోడియం, ఎర్బియం డోప్డ్ ఆక్సిఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ ఫోటోనిక్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.ఈయన రూపొందించిన పరిశోధన పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి.

## ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి: పోతుగుంట



పుత్తూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త : మెరుగైన ప్రాథమిక విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. మంగళవారం నెత్తం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెత్తం, చెర్లోపల్లి, చిన్నరాజుకుప్పం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అందులో భాగంగా ఇంతకు ముందు చెర్లోపల్లి, చిన్నరాజుకుప్పం పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా సామగ్రి అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిన్నయ్యశెట్టి, నాయకులు విజయ్‌శేఖర్‌నాయుడు, చంద్రయాదవ్, మధుసూదనరాజు, కుమార్‌రెడ్డి, గోవర్ధన్ యాదవ్, బండి రమేష్, మణికంత, పోతుగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన అవనాక్షమ్మ అమ్మవారి జాతర



నారాయణవనం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన అవనాక్షమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమైనది. మొదటిరోజు మంగళవారం నారాయణవనం మేజర్ పంచాయతీలోని రత్నాంగి, చిత్రాంగి, కోటవీధి, గణపతి నగర్‌తో పాటు 3,4వార్డుల్లో కాపురం వుంటున్న సె ంగుంధర్ మొదలియార్ కులస్తులు (పెద్దకచ్చి) నాలుగురోజుల పాటు జాతరను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అందులో భాగంగా మంగళవారం మొదటిరోజు సెంగుంధర మొదలియార్ కులానికి చెందిన మహిళలు పెద్దఎత్తున ఆలయం వద్దకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించుకున్నారు. చివరిరోజు శుక్రవారం రాత్రి తమిళనాడు రాష్ట్రం సుమారు 100 కిలోల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి పురవీధుల్లో ఊరేగించనున్నారు.

## శివయ్య సన్నిధిలో మల్లారెడ్డి పూజలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను తెలంగాణ రాష్ట్రం మల్కాజ్‌గిరి శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కుటుంబసభ్యులతో పూజలు నిర్వహించారు. వారికి తెలుగుదేశం నాయకులు ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. పానగల్ నుంచి ఆలయం వరకు ఫ్లేక్సీలతో స్వాతం పలికారు.దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ మోహన్,ఎపిఆర్ఓ రవిలు వేదపండితులచే స్వాగతం చెప్పారు. తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.

## నిత్యాన్న దానానికి విరాళం



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం నిత్యాన్నదాన పథకానికి కావలికి చెందిన భక్తులు నిత్యాన్నదాన పథకానికి విరాళం అందించారు. ఈనేపథ్యంలో మంగళవారం కావలి వాస్తవ్యులు కొండపి నాగలక్ష్మీ కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె నిత్యాన్న దాన పథకానికి రూ.1,00,116లు అందించారు. విరాళాన్ని ఎఇఓ మోహన్‌ద్వారా దేవస్థానం గణాంకాధికారికి అందించారు.

## కయ్యూరిని సత్కరించిన అభిమానులు



తొట్టంబేడు,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలోని దిగువ సాంబయ్య పాళెంలో పని చేస్తున్న ఫౌండేషన్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డును అందుకున్న కయ్యూరి బాల సుబ్రమణ్యంను మంగళవారం ఘనసన్మానం నిర్వహించారు. గ్రామస్తులు, పాఠశాల సహోపాధ్యాయులు సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. కయ్యూరి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ అవార్డు రావటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సన్మాన కార్యక్రమాల్లో విద్యాకమిటి సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ కల్పన, వైస్‌చైర్మెన్ నిర్మల,ఆయాలు మాధవి, జయ, రత్న,వంట ఏజెన్సి పద్మ సభ్యులు మాతయ్య, ఉషా, శంకర్‌రెడ్డి, మోహన్ కుమార్, ఆశోక్, దివాకర్, వెంకటరెడ్డి, అంగన్‌వాడి కార్యకర్త మోహన,రాణి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మచెరువు రోడ్డు సమస్యను పరిష్కరించండి

శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: మండలంలోని అమ్మచెరువు రోడ్డు సదుపాయం కోసం ఏళ్ళ తరబడి అభ్యర్థిస్తున్నా పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసారు.శ్రీకాళహస్తి మండలంలోని పాతగుంట పంచాయతీలోని అమ్మచెరువు గ్రామానికి ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి నుంచి సుమారు ఒకటిన్నర కిలో మీటర్లు లోపలకు వెళ్ళాల్సి వస్తుందని వివరించారు.ఈ మేరకు మంగళవారం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విన్నపాలు చేసినా పట్టించుకోవటం లేదని వివరించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన ఆదినారాయణ,పెంచులయ్య, వెంకటేష్, చించేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై రాజీలేని పోరాటం

## - మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య




సూళ్లూరుపేట, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: రాష్ట్ర వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతుల సమస్యలపై రాజీలేని పోరాటాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళవారం సూళ్లూరుపేటలోని వినాయకగుడి సెంటర్ వద్ద నున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి అన్నదాత పోరు కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. ఈ సందర్భంగా సంజీవయ్య మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఎరువుల కోసం అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఎరువులను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం హయాంలో సింగిల్‌విండో, ఆర్‌బికెల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలను అందజేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తిపలికి ప్రైవేటురంగానికి ఎరువుల విక్రయాలను అప్పగించిందని చెప్పారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు పోరు బ్యానర్‌ను వైసీపీ నాయకులు తీసుకెళుతుండగా పోలీసులు బ్యానర్‌ను తొలగించారు. అనంతరం ప్లకార్డులు చేతబూని పెద్దగా నినాదాలు చేస్తూ వైసీపీ కార్యకర్తలు, నేతలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, మీజూరు రామకృష్ణారెడ్డి, కలికి మాధవరెడ్డి, దీపిక, దారా రవి, అయితా శ్రీధర్, వి.కృపాకర్‌రెడ్డి, చిన్ని సత్యనారాయణ, అలవల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరికీ యూరియా అందించాలి

## - ఎమ్మెల్సీ మేరిగ, నేదురుమల్లి





గూడూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సమస్యలను అధికారులకు తెలిపేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అన్నదాత పోరు కార్యక్రమం ఏర్పాటు చేస్తే ప్రభుత్వం పోలీసుల ద్వారా అనేక కాంక్షలు విధిస్తుందని గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల ఎంతో సంతోషంగా ఉన్నారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరీగా మురళి, వెంకటగిరి నియోజక వర్గ ఇంచార్జీ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ మేరిగమురళి, నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, నియోజకవర్గంలోని మండలాల నాయకులు రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి,కోడూరు మీరా రెడ్డి, కోడూరు కల్పలత ,బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయ్‌కుమార్ రెడ్డి , ఎంపీపీ గురవయ్య, భక్తవత్సల రెడ్డి, దువ్వూరు మధుసూదన్ రెడ్డి, ఎద్దుల మధుసూదన్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నందవరం సుబ్బారావు, సుభాన్, సునీల్ రెడ్డి, వెంకటగిరి గూడూరు నియోజకవర్గాలోని వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## మాపై అక్రమ అరెస్టులకు పాల్పడ్డారు

### - ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: రెండు సంవత్సరాల క్రితం సరిగ్గా ఇదే రోజు మీ ప్రభుత్వం హయాంలో టవర్ క్లాక్ సెంటర్ నందు మా పై జరిగిన అక్రమ అరెస్టలకు నిదర్శనమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మీరు స్వేచ్ఛగా వెళ్లి వినతిపత్రం అందించి, ప్రెస్ మీట్‌లు పెడుతున్నారని అన్నారు. ప్రజలకు గతంలో మీరు చేస్తున్న అన్యాయం పై తాము వినతిపత్రం, ప్రెస్ మీట్‌లు పెట్టాలంటే మా ఇళ్ల ముందరకి వ్యాన్‌లలో పోలీస్‌లు వచ్చి ఇంటిని చుట్టూ ముట్టి బయటకు రానిచ్చేవారు కాదన్నారు. అది ప్రజాస్వామ్యం గురించి తెలిసిన మా నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి, మీ రాజ్యాంగ ప్రభుత్వం పని తీరుకు నిదర్శనమన్నారు. ఇచ్చిన హామీలను 20 నెలలోనే అమలు చేసాం కాబట్టే ఈ రోజు మా ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. మేము ప్రజలలో ధైర్యంగా తిరుగుతున్నామన్నారు. రేపు అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం చూడలేకే మీరు ఈ రోజు ఇలా నిరసనకు దిగారని అన్నారు. మీరు ఎంత చేసిన ప్రజలు ఇక మీ మాటలు నమ్మరని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సవాల్ చేసారు.

## ఫీల్డ్‌అసిస్టెంట్‌పై విచారణ

కోట,సెప్టెంబరు 9 ప్రభాతవార్త: మండలంలోని తిమ్మానాడుపాళెం క్షేత సహాయకుడు శివప్రసాద్‌పై పలు ఆరోపణలతో జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఆమేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం వెంకన్నపాళెం గ్రామ సచివాలయంలో ఎంపిడివో దీలిప్ కుమార్, ఎపిడి వరప్రసాద్ విచారణ చేపట్టారు. ఈ విచారణ సందర్భంగా ఫిర్యాదు చేసిన అతనే వచ్చి ఫీల్డ్ అసిస్టెంట్ శివ ప్రసాద్ మంచి వాడని చేపట్టడంతో విచారణ ముగిసిపోయింది.

## సీఎం సభకు వెళ్లిన బస్సులు.. ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు

కోట,సెప్టెంబరు 9 ప్రభాతవార్త: అనంతపురం జిల్లాలో జరిగిన ముఖ్యమంత్రి బహిరంగ సభకు వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు 98 శాతం వేళ్లడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలోని చంద్రవేఖపురం గ్రామానికి చెందిన విద్యార్థులు చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఆ విద్యార్థులు రోజు వారిలా రోడ్డుపై కి వచ్చి బస్సు కొరకు నీరిక్షిస్తున్నారు. అదే విధంగా మెట్టులోని జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు కూడా విద్యానగర్‌లో బస్సుల కొరకు ఎదురు చూడటం వారి వంతైంది. స్కూల్ సమయం దాటుతున్న బస్సులు రాకపోవడంతో వారు వెనుతిరిగారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రయాణికులు గంటల కొద్ది బస్సుల కొరకు వేచి చూసి వారి ప్రయాణలను వాయిదా వేసుకున్నారు. బస్సుల రద్దుపై వాకాడు డిపో మేనేజర్ ను ప్రభాతవార్త వివరణ కోరగా సీఎం సభకు బస్సులను పంపడం జరిగిందని చెప్పారు.

## శిధిలా వ్యవస్థ చేరిన ఎఫ్ డబ్ల్యూ పిసి షెడ్డు



దొరవారి సత్రం,సెప్టెంబర్9 ప్రభాతవార్త:చెత్త సేకరించాల్సిన రిక్షాలు శిథిలావస్థకు మండల పరిధిలోని తుంగమడుగు గ్రామంలో శిథిల వ్యవస్థ చేరిన ఎఫ్ డబ్ల్యూ పిసి షెడ్డు పట్టించుకోని అధికారుల దొరవారిసత్రం మండలంలోని డబ్ల్యూ పిసి షెడ్లు ఎక్కడ చెత్త అక్కడే షెడ్ల ద్వారా ఎరువు తయారు చేయిం చాలని ప్రభుత్వాలు ఆలోచనలో ఉంటే ఆ చెత్త సేకరించడంలో అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు కనీసం చెత్త సేకరించేవారు వారంలో ఒకసారైనా రావడంలేదని మండలంలోని అన్ని పంచాయతీల పరిస్థితి ఇలాగే ఉంది తనియాలి తల్లంపాడు కట్టపల్లి పూల తోట చెత్త సేకరించడం లేదని గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు ఇకనైనా అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను ఎఫ్ డబ్ల్యూ పిసిషెడ్లకు చేర్చాలని ఆ గ్రామస్తులు కోరుకుంటున్నారు

## సచివాల వ్యవస్థకు దూరమవుతున్న విఆర్వోలు

దొరవారి సత్రం,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండలంలోని 22 పంచాయితీలు 11 సచివాలయాలు ఉండగా ప్రజలు అవసరాలు తీర్చిన అధికారులే అందుబాటులో లేకపోవడం గత ప్రభుత్వంలో విఆర్వోలు సచివాలయ వ్యవస్థకి పరిమితంగా ఉండేవారు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారి సమస్యలని అక్కడికక్కడే పరిష్కరించేవారు. ఇప్పుడు మాత్రం కనీసం పిల్లల పాఠశాల సమయంలో కుల ధ్రువీకరణ పత్రం మరియు ఆదాయం ధ్రువీకరణ పత్రం వారాల కొద్ది నిరీక్షించాల్సి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు ప్రజలు భూ సమస్యల కోసం సచివాలయ చుట్టూ తిరుగుతున్న విఆర్వోలు సచివాలయంలో అందుబాటులో లేకపోవడం పలువురు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని పోలిరెడ్డి పాలెం సచివాలయంలో గతంలో ఉన్న వీఆర్వో ఆరోగ్యరీత్యా సెలవులో ఉండగా కల్లూరు సచివాలయానికి సంబంధించిన వీఆర్వో యుగంధర్ ఇన్చార్జిగా నియమించడం జరిగింది. అయితే సంబంధించిన విఆర్ఓ రెండు వారాలు అవుతున్న కనీసం సచివాలయం రాలేదని ఆ సచివాలయ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు

## గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నందిమండలం బాలకృష్ణం రాజు దాతృత్వంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు పౌష్టికాహారాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా, బాలకృష్ణం రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ రాజు మాట్లాడుతూ నేను జనవిజ్ఞాన వేదిక ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, మంచి కార్యక్రమాలలో వారితో కలసి పనిచేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. గత 12 సంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో భోజనాలు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో నాగరాజు, చెంచునారాయణ, రామ మోహన్, సురేష్ రెడ్డి, ప్రభాకర్, సుబ్బారావు, బాబు, ఆనంద్, ఇబ్రాహీం, శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బీకేఆర్‌లో ఆర్మీ జవాన్లకు శిక్షణ



కోట,సెప్టెంబరు 9 ప్రభాతవార్త: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో మంగళవారం ఆర్మీ జవాన్లకు శిక్షణ తరగతులు ప్రారంభమైయి. ఈ శిక్షణ తరగతులు వారం రోజుల పాటు జరుగుతాయి.కమాడింగ్ ఆఫీసర్ కల్నెల్ అరుణ కుమూర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న జవాన్లకు ఈశిక్షణ తరగతులు ఏంతోగానో ఉపయోగపడుతాన్నారు. డ్రిల్, ఫైరింగ్, దేశ భక్తి, ఐక్యత సోదరి భావం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. తమకు శిక్షణతరగతులకు కళాశాలలో అన్ని రకాల అనుమతులు ఇచ్చిన కరస్పొండెట్ నేదురుమల్లి రామకుమూర్‌రెడ్డికి కృతజ్ఞతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, డాక్టర్, వి.విజయకుమార్‌రెడ్డి,ఎన్‌సిసి అధికారి, గోవిందు మాదవయ్య, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దాహం తీర్చిన ఎమ్మెల్యే



కోట,సెప్టెంబరు 9 ప్రభాతవార్త: మండలంలోని చిట్టేడులోని నల్లపరెడ్డి చంద్రవేఖర్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోరు చేడిపోయి మంచి నీటి కొరకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో విద్యా కమిటి ఛైర్మెన్ శ్రీనివాసులు, స్థానిక తెదేపా నాయకులు చంద్రశేఖర్ గూడూరు శాసన సభ్యులు డా.పాశిం సునిల్ కుమూర్ దృష్టికి విద్యార్థుల సమస్యను తీసెకెళ్లారు. దీంతో శాసన సభ్యులు సునిల్ కుమూర్ వెంటనే స్పందించి స్కూల్‌లో బోరు వేయంచారు. ఈ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు శాసన సభ్యులు పాశిం సునిల్ కుమూర్ కృతజ్ఞతలు తెలిపారు.

## లావాదేవీలపై అనుమానులొద్దు



కోట,సెప్టెంబరు 9 ప్రభాతవార్త: ప్రభుత్వం పొదుపు సంఘాలను బలోపేతం చేసేందుకు అనేక సంస్కరణలను తీసుకొస్తుందని ఎపిఎం అనిల్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయాంలో పోదుపుగ్రూపు సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు శ్రీనిధి ద్వార రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా మన డబ్బులు మన లెక్కల యూప్ ద్వార మన బ్యాంకుల్లో ఎ సంఘం డబ్బులు ఏంత ఉన్నాయో స్పష్టంగా తెలుసుకొచ్చాన్నారు. పోన్లకు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందన్నారు. డబ్బులు ఎక్కడ కూడా పక్కదారి పట్టి అవకాశం లేదన్నారు.మహిళలు చేపలు పెంపకం,పెరటి కోళ్ల, రైతు సంఘాలను మరింత బలోపేతం చేయడం తదితర కార్యక్రమాలపై వివరించారు.ఈ సమావేశంలో సిసిలు,విఏఒలు పాల్గొన్నారు.

# అన్నదాతను ఆదుకోండి



పెళ్లకూరు సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైఎస్సార్సీపీ పార్టీ శ్రేణులు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారికి బాసటగా శాంతియుత ర్యాలీలు నిరసనలు తెలుపుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మంగళవారం నాడు సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట పట్టణం నందు సూళ్లూరుపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో రైతులకు బాసటగా శాంతియుత ర్యాలీని నిర్వహించి ఆర్డిఓ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెళ్లకూరు మండలం నుంచి మాజీ ఎన్‌డిసిబి చైర్మన్ మరియు రాష్ట్ర వైఎస్ఆర్సిపి కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్సీపి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని రైతులకు సంఘీభావం తెలపడం జరిగింది.

## నిధులు దుర్వినియోగంపై ఎంపీడీవోకు వినతి



పెళ్లకూరు సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : మండలంలోని శిరసానంబేడు పంచాయితీ నందు పంచాయితీ నిధులు దుర్వి నియోగం పై గ్రామ ప్రజలు మంగళవారం నాడు ఎంపీడీవో ప్రమీలారాణి గారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామంలో 2021 సంవత్సరం నుండి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగపోగా 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్ఎఫ్‌సి) నిధులు, మరియు జనరల్ ఫండ్స్ నిధులను పూర్తిగా దుర్వినియోగం చేస్తూ గ్రామంలో ఏ పని చేయ కుండానే అందుకు సంబంధించిన (పిఆర్ అండ్ ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులను బెదిరించి ఎం బుక్ రికార్డు చేయించి నిధులను పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కనుక ఇప్పటికైనా ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు స్పందించి 15 ఆర్థిక సంఘం నిధులు స్టేట్ ఫైనాన్స్ కమిషన్(ఎస్ఎఫ్‌సి) నిధులు మరియు జనరల్ ఫండ్స్ నిధులను నిలుపుదల చేసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం కాకుండా ఆపగలరని కోరారు.

## రెండు రోజులు పాటు పాఠశాలలకు సెలవు

బాలాయపల్లి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: పోలేరమ్మ జాతర సందర్భంగా మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు ఈ నెల 10,11 తేదీలలో సెలవు ప్రకటిస్తూ ఉన్న అధికారులు ఇతరులు జారీ చేసినట్లు ఎంఈఓ జి నాగేశ్వరరావు తెలిపారు. దుర్గ చేసినందుకు పోలేరమ్మ జాతర కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు రెండు రోజులు సెలవు ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు రెండు రోజులు పాఠశాలకు రానవసరం లేదని తెలిపారు.

## వైసిపి పార్టీలో చేరిక



గూడూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: కోట పట్టణానికి చెందిన షేక్. రేష్మ మంగళవారం గూడూరులోని ఎమ్మెల్సీ మెరిగ మురళీధర్ నివాసంలో గూడూరు నియోజకవర్గ కోట మండలం అధ్యక్షులు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మెరిగ మురళీధర్, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి చేతుల మీదుగా రేష్మని వైసిపి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాబోతున్న ఎన్నికల్లో వైసిపి పార్టీ గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## పోలేరమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

### - సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా



వెంకటగిరి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: ఈనెల 10,11 తేదీల్లో జరిగే పోలేరమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. పోలేరమ్మ జాతర సందర్భంగా జరుగుతున్న ఏర్పాటులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పోలేరమ్మ గుడి వద్ద కట్టుదిట్టంగా క్యూలైన్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాగునీరు సమస్యలేకుండా చర్యలు తీసుకుంటున్నారు చెప్పారు. క్యూ లైన్‌ల వద్ద కూలర్లు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు కూడా దాతలను విజయవంతంగా చేసేందుకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆలయం ఈవో శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి, సీఐ ఏవి రమణ పలుశాఖల అధికారులు ఉన్నారు.

## అధికంగా యూరియాను ఉపయోగించరాదు



వెంకటగిరి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: రైతులు యూరియాను అధికంగా వినియోగించరాదని ఎడిఏ అనసూయ తెలిపారు. మండలం నందు వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏపీ సి ఎన్ ఎఫ్ వారి తరపున సబ్సిడీలో పీఎండీఎస్ కిట్లు గిరిజన రైతులకు పంపిణీ చేయడం జరిగినది. యూరియా కొలత లేదని ఆమె రైతులకు తెలిపారు. ఎరువులను కూడా వ్యవసాయశాఖ అధికారులు సూచన మేరకు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమం నందు ఐటీడీఏ సంస్థ వ్యవసాయ అధికారిని డి. నీరజారెడ్డి, స్థానిక వ్యవసాయ అధికారులు పి సుజాత, జి ప్రవీణ, సంస్థ సతీష్ కుమార్ ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది సుహార్లత, రైతులు పాల్గొన్నారు.

# వరసిద్ధుని సన్నిధిలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్



కాణిపాకం, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్ మంగళవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా త్యాగరాజన్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ సీఎఫ్ఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సముద్ర తీర ప్రాంతాల వద్ద భద్రత పటిష్టం : కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త : సముద్ర తీర ప్రాంతాల వద్ద భద్రత ఏర్పాట్లను సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటి ఛైర్మన్ హోదాలో మాట్లాడుతూ డిప్యూటీ ఎస్పీ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, విశాఖపట్నం వారు సూచించిన మేరకు కోస్టల్ పోలీస్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ మరమ్మమతులకు, కాంపౌండ్ వాల్ నిర్మాణం అంశాలకు సంబంధించి నిధులను అందుబాటు మేరకు పరిశీలించి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళేటప్పుడు తమ వెంట ఆధార్ కార్డు, బయోమెట్రిక్ కార్డు తీసుకుని వెళ్ళాలన్నారు. డెప్యూటీ ఎస్పీ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ జి. బాలిరెడ్డి, కస్టమ్స్‌ప్రివెంటివ్ డివిజన్ తిరుపతి అసిస్టెంట్ కమిషనర్ కె.విజయకుమార్, కోస్ట్‌గార్డ్ అధికారి పీకే సురేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్, మెరైన్ పోలీస్ అధికారులు మాలకొండయ్య, అంజిరెడ్డి, కృష్ణపట్నం, పోర్ట్ కన్జర్వేటర్ బీవీఎల్ నరసింహులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

### ఎమ్మెల్యే భానుప్రకాశ్ ఆదేశాలు



పుత్తూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాలపేట మండలాల్లోని సాగునీటి చెరువుల మరమ్మ తులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఇరిగేషన్ డిఇ ఎం.శ్రీనివాసులునుఆదేశించారు. మంగళవారం రెండు మండలాల్లోని చెరువుల పునరుద్ధరణ పనుల నిమిత్తం అధికారులతో జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చెరువుల మరమ్మతులకు అవకాశం వున్నందున ఆ పథకం కింద పనులు చేసేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. అలాగే నాబార్డ్ నిధులతో చేయాల్సిన పనులను కూడా గుర్తించాలన్నారు. చెరువుల కట్ట బలోపేతం, కలుజు మరమ్మతులు, సప్లయి ఛానెళ్ల పూడిక తీత, గొలుసు కట్టు చెరువులను అనుసంధానించే కాల్వల మరమ్మతులు వంటి పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. డిఇ శ్రీనివాసులు మాట్లాడుతూ పుత్తూరులో 34, వడమాలపేటలో 25 చెరువులు వున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన (ఆర్.ఆర్.ఆర్.) రిపేర్లు, ఆధునికీకరణ, పునరుద్ధరణ కింద పుత్తూరులో 2, వడమాలపేటలో 5 మొత్తం ఏడు చెరువులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రెండు మండలాల్లో అన్ని చెరువులను పరిశీలించి త్వరలోనే ప్రతిపాదనలు అందిస్తామన్నారు. సమావేశంలో పుత్తూరు ఎఇ పరశురామ్ నాయక్ కూడా పాల్గొన్నారు.

# నాడు అన్నదాతను మోసగించిన...
# ఘనులు నేడు ఆందోళనలు : ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 9 ప్రభాతవార్త: నాడు విచ్చల విడిగా పరిపాలించిన నాయకులు అన్నదాతలను మోసగించి నేడు అన్ని విధాల ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వంపై ఆందోళన చేయటమా? అని స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శివమెత్తారు.మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి హయాంలో రైతులు ఎన్ని విధాల ఇబ్బందులు పడ్డారు. ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. కరువును పరిశీలించటానికి వచ్చిన నాయకుడు ఎర్రతివాచీలు, పరదాల మాటున వెళ్ళి సంఘటన రైతులు మరువలేదన్నారు. యూరియా కోసం ఎన్ని ఇబ్బందులు పడ్డారో ఎవరిని అడిగిని చెబుతారని సుధీర్‌రెడ్డి శివమెత్తారు.పంట బీమా పేరుతో రైతులను మోసం చేసిన జగన్ మోహన్‌రెడ్డి ఆయన అనుచరులు నేడు రోడ్డునెక్కటానికి ప్రయత్నించటం దారుణమన్నారు. వైసిపి పాలనలో నరకం అనుభవించిన రైతులు యూరియా కోసం రాత్రి వేళల్లో జాగారణం చేసిన సంఘటనలు నేడు కనబడలేదా? అని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఐదేళ్ళ చేతకాని పాలనతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన ఘనుడు నేడు మాట్లాడటం గమనిస్తే వీరికి అధికారం,రాజకీయం తప్ప మరేమి లేదన్నారు. రైతు కుటుంబం నుంచి పరిపాలనకు వచ్చిన చంద్రబాబునాయుడు అన్నదాతల బాధలు నెరిగి కేంద్రంపైవ త్తిడి తెచ్చి అదనపు యూరియాను రప్పించారన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఏడాదికి ఆర్ఎస్‌కెల ద్వారా రూ.255కోట్ల విలువ చేసే యూనియాను అమ్మగా కూటమి ప్రభుత్వంలో రూ.292కోట్ల విలువ చేసే యూనియాను సరఫరా చేసామన్నారు.

## మండల మీట్ రసాభాస



సత్యవేడు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జడ్పీటీసీ విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా చెరివి పంచాయతీలో నిధులు దుర్వినియోగం సంబంధించి తనపై వచ్చిన ఆరోపణల అంశాన్ని ఎంపీటీసీ రామయ్య లేవనెత్తారు. పంచాయతీ పరిధిలో 2014 నుంచి 2024 వరకు దాదాపు 50 లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు గ్రామస్తుల్లో ఒకరి నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారన్నారు. అయితే విచారణ నేపథ్యంలో కనీసం తనకు సమాచారం ఇవ్వకుండా నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోకుండా డివిజనల్ పంచాయతీ అధికారి ఏకపక్షంగా విచారణ చేయడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పైగా తాను సర్పంచ్‌గా ఉన్న హయాంలో జరిగిన పనులకు సంబంధించి ఎం బుక్కులు, రికార్డులు పరిశీలించకనే ఆరోపణ చేయడంపై ఇన్‌చార్జి ఈవో అండ్‌ఆర్‌డీ మునిరవి కుమార్‌ని నిలదీశారు. దీంతో పాటునిధులు దుర్వినియోగం విచారణ నేపథ్యంకూడా పత్రికల్లో రావడంతో తన గౌరవ ప్రతిష్టకు భంగం కలిగిందన్నారు. దీనిపై ఇన్‌చార్జి ఈవో అండ్ ఆర్‌డీ ముని రవికుమార్ స్పందిస్తూ డివిజనల్‌పంచాయతీ అధికార రావడం వల్ల స్థానిక అధికారులు విచారణకు హాజరు కావడం తప్పని సరి అన్నారు. కానీ నిధులు దుర్వినియోగంకు సంబంధించి విచారణ పూర్తి కాలేదన్నారు. రికార్డుల పరిశీలనపై సమగ్ర విచారణ తరువాత నిధులు వినియోగం ఆరోపణలపై స్పష్టత వస్తుందన్నారు. దీనిపై వాడి వేడిగా రగడ మొదలు కావడంతో ఎంపీపీ ప్రతిమ జోక్యం చేసుకుని ఎంపీటీసీ రామయ్యకు సర్ది చెప్పడంతో యధావిధిగా పలువురు స్థానికప్రజాప్రతినిధులు సమస్యలను లేవనెత్తారు. విద్యాశాఖ చర్చలో దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి జోక్యం చేసుకుని చెన్నేరి పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్న నాగలాపురం మండలానికి చెందిన మహిళను తొలగించి స్థానిక మహిళకు అవకాశం కల్పించాలని ఎంఈవో-2 ఉషకు విన్నవించారు.విద్యార్థుల సౌకర్యార్థం నాగలాపురం నుంచి ఓబుల్‌రాజు కండ్రిగ మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలని రాజగోపాలపురం సర్పంచ్ మధురాజు సభకు దృష్టికి తెచ్చారు. వ్యవసాయశాఖ చర్చలో ఏవో మురళి మాట్లాడుతూ మండలంలోని రైతులకు ప్రస్తుతం 22.5 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతి చెందిన వైస్ ఎంపీపీ సరోజినికి సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఈ సమావేశంలో మండలపరిషత్ సీనియర్ అసిస్టెంట్ హేమభూషణం, వైద్యులు విద్యాసాగర్, క్రిస్టల్ దాస్, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్, ఉపాధి ఏపీవో విజయభాస్కర్, ఇన్‌చార్జి ఆర్ఐ సురేష్,పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,అధికారులు పాల్గొన్నారు.

**IIT KANPUR - CENTRE FOR ENVIRONMENTAL STUDIES AND ENGINEERING (CESE)**

**Recruitment Notification (Last Date: September 13, 2025)**

Be a part of **"Swarna Kuppam Net Zero Constituency project"** in collaboration with IIT Kanpur

**Applications are invited for the following positions in Kuppam:**

**1. Senior Project Executive Officer – 01 Post**
(**Qualifications:** Ph.D. with 3 yrs exp. / M.Tech/M.E. with 6 yrs exp. / MBA with 6 yrs exp.) **Salary:** Rs. 70,000 – 2,00,000 Per Month
For more info https://www.iitk.ac.in/dord/project/cese-speo-26-08-25.html

**2. Senior Project Engineer – 04 Posts**
(**Qualifications:** Ph.D. / M.Tech / B.Tech with 3 yrs exp.)
**Salary:** Rs.38,800 – 96,400 Per Month
For more info https://www.iitk.ac.in/dord/project/cese-spe-26-08-25.html

**3. Project Executive Officer – 04 Posts**
(**Qualifications:** Ph.D. / M.Tech with 3 yrs exp. / B.Tech+MBA with 3 yrs exp. / B.Tech with 5 yrs exp.)
**Salary:** Rs. 50,400 – 1,26,000 Per Month
For more info https://www.iitk.ac.in/dord/project/cese-peo-26-08-25.html

Interested candidates may email their CV & cover letter to
(recruitmentcese@gmail.com)
(Only shortlisted candidates will be called for an interview).